

హైదరాబాద్ వార్త

# శివార్లలో భారీగా "కొత్తవిద్యుత్ కనెక్షన్లు"

## -అత్యధికంగా హబ్సిగూడ సర్కిల్‌లో 9.24 లక్షలు
## - కొత్తగా 9సబ్ స్టేషన్ల నిర్మాణానికి స్థల సేకరణ



**హైదరాబాద్, జనవరి 3,ప్రభాతవార్త:** రికార్డుస్థాయిలో పెరుగుతున్న డిమాండ్ గ్రేటర్ శివారు ప్రాంతాల్లో రికార్డుస్థాయిలో కొత్తవిద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నాయి. దక్షిణ డిస్కంలో అత్యధిక విద్యుత్ కనెక్షన్లు హబ్సిగూడ సర్కిల్లో 9.24 లక్షలకు చేరాయి. మరో 5నుంచి 6 నెలల్లో ఇక్కడ విద్యుత్ కనెక్షన్ల సంఖ్య 10 లక్షలు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈసర్కిల్‌లోనూ అత్యధికంగా హబ్సిగూడ, కీసర డివిజన్లలో పెద్దసంఖ్యలో కొత్తవిద్యుత్ కనెక్షన్లకు దరఖాస్తులు వస్తున్నాయి. ఈనేపథ్యంలో పెరుగుతున్న విద్యుత్కనెక్షన్లతో పాటు డిమాండ్ భారీగా పెరుగుతుండటంతో కొత్త సబ్ స్టేషన్ల ఏర్పాటుపై సర్కిల్ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. కొత్త స్టేషన్ల ఏర్పాటుకు స్థలాల కోసం ఇప్పటికే కలెక్టర్ కు లేఖలు లేఖలు రాసి 9 ప్రాంతాల్లో స్థలాలు గుర్తించి సేకరించారు. హబ్సిగూడ సర్కిల్లో 3 డివిజన్లు సైనిక్‌పురి, హబ్సిగూడ, కీసర డివిజన్లు ఉండగా 8 సబ్‌డివిజన్‌లు, 28 ఆపరేషన్ సెక్షన్లు ఉన్నాయి. కీసర, హబ్సిగూడ డివిజన్ల పరిధిలో పెద్దసంఖ్యలో నిర్మాణాలు జరుగుతుండటంతో విద్యుత్ కనెక్షన్లు, డిమాండ్ పెరుగుతోంది. దక్షిణ డిస్కం మొత్తం 20 సర్కిళ్లలో అత్యధికంగా హబ్సిగూడ సర్కిల్లో 9.24 లక్షల కనెక్షన్లు ఉండగా, రెండో స్థానంలో మేడ్చల్ లో 8.76 లక్షలు, మూడోస్థానంలో సంగారెడ్డిలో 8.11 లక్షలు, సరూరనగర్‌లో 7.89 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. శివారు ప్రాంతాల సర్కిళ్లలో ప్రతినెలా 23 వేల కొత్త విద్యుత్కనెక్షన్లను విద్యుత్శాఖ జారీ చేస్తోంది.

**కొత్త సబ్ స్టేషన్లకోసం స్థల సేకరణ..**

విద్యుత్ కనెక్షన్లు పెరుగుతుండటంతో డిమాండ్ ఆదేస్థాయిలో పెరుగుతుంది. 2023 వేసవిలో విద్యుత్‌డిమాండ్ భారీగా పెరగడంతో పలు సబ్ స్టేషన్లపై ఓవర్‌లోడ్ పడి సమస్యలు తలెత్తాయి. పెరుగుతున్న డిమాండ్ దృష్టిలో పెట్టుకొని ఉప్పల్ భగాయత్‌లో ఓసబ్ స్టేషన్ నిర్మాణం పూర్తిచేసిన విద్యుత్ శాఖ మరో 8 కొత్త సబ్ స్టేషన్ల ఏర్పాటుకు స్థలాలు సేకరించి టెండర్లు పిలిచింది. వెంకటా పూర్, మేడిపల్లి, హై కోర్టు కాలనీ (ఎన్టీఆర్), మియాపూర్ విలేజ్ (చిలుకాన గర్), బోడుప్పల్ (మేడిపల్లి), యాదాద్రికాలనీ, శాంతినగర్ (చేర్యాల), ఆర్కేపురం (మల్కాజిగిరి) ప్రాంతాల్లో ఈఏడాది కొత్త సబ్‌స్టేషన్లు పూర్తిచేసి ప్రారంభించే దిశగా చర్యలు చేపడుతున్నారు. హబ్సిగూడలో 33/11 సబ్ స్టేషన్లు 57 ఉండగా, పవర్ ట్రా న్స్ఫార్మర్లు 122 ఉన్నాయి. కొత్తసబ్ స్టేషన్లు అందుబాటు లోకి తీసుకురావడంతో పాటు 57 సబ్జెస్టేషన్ల పరిధిలో పెరిగిన డిమాండ్ కు తగినట్లు పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థం పెంచుతున్నారు.

### డిమాండ్‌కు తగ్గట్లుగా చర్యల : బ్రహ్మం, హబ్సిగూడ ఎస్ఈ



పెరుగుతున్న విద్యుత్ కనెక్షన్లు, డిమాండ్‌కు తగినట్లు విద్యుత్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం. 90 వరకు 11 కేవీ ఫీడర్లను విభజించి, పలు ఫీడర్లు ఇంటర్‌కనెక్ట్ చేశాం. కొత్తగా 33 కేవీ ఫీడర్లు 14 అందుబాటు లోకి తీసుకువచ్చాం. సమ్మర్‌లో పెరిగే డిమాండ్‌కు సరిపడా 218 కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటుచేయడంతో పాటు 327 ట్రాన్స్ఫార్మర్ల సామర్థం పెంచుతున్నాం. 9 సబ్ స్టేషన్లలో 8 ఎంవీఏ సామర్థం నుంచి 12.5 ఏంవిఏ పవర్ ట్రాన్స్ఫార్మర్ల సామర్థం పెంచడంతో పా టు మరో 5 ప్రాంతాల్లో 5 ఎంవీఏ సామర్థం నుంచి 8 ఎంవిఏకు పెంచేదిశగా చర్యలు చేపట్టాం.

# రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్‌లు రద్దు

## -మంత్రి పొన్నం ప్రభాకర్





**హైదరాబాద్, జనవరి 3 ప్రభాతవార్త**

రోడ్డు నిబంధనలు ఉల్లగించిన వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ట్రాఫిక్ రూల్స్ బ్రేక్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్స వాలు ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. పాఠశాల విద్యా ర్థులతో కలిసి రోడ్డు భద్రతాపై రోడ్డు భద్రతా అవగాహన ర్యాలీలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. రహదారి భద్రతా పోస్టర్లను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. రవాణా శాఖ కార్యాలయం ప్రాంగణంలో ఎలక్ట్రిక్ వెహికిల్ చార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభించారు, ఈ కార్యక్ర మంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్,హైద రాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విశ్వ ప్రసాద్ అడిషనల్ సీపీ ట్రాఫిక్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రోడ్డు రవాణా , ఆర్టీసీ, భవనాలు రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ పాయిం ట్లను గుర్తించి తొలగిస్తామని చెప్పారు. ఈనెల 7వ తేదీన కేంద్ర మంత్రి నితిన్ గడ్కారీతో భేటీ ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో రోడ్డు భద్రతపై చర్చిస్తామని అన్నారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ పై ఆవేర్నెస్ కల్పిస్తామని అన్నారు. భాగ్యనగరంలో అనేక జంక్షన్‌లు వస్తున్నాయని, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ ఒక ముగ్గరికి అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్స వాలు శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యాయని చెప్పారు. రోడ్డు భద్రతా మాసోత్స వాల్లో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని, ప్రమాదాలు నివా రించాలని ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. తెలంగాణలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ రవాణా శాఖ, పోలీస్ శాఖ, విద్యా శాఖ అన్ని రకాల డిపార్టుమెంట్‌లు ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని రవాణా శాఖ పక్షాన కోరామన్నారు. రోడ్డు భద్రతపై ఎవరికి వారు అవగాహనతో అమలు చేయాలని చెప్పారు. ప్రజలు చైతన్యం కావాలని, సామాజికంగా ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. ప్రతి పాఠశాలలో యునిసెఫ్ సహకారం తో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ సంవత్సరం 500 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో ఈ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. చిన్న తనం నుంచే ట్రాఫిక్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. ఏ కార్యక్రమం అయినా చిన్నప్పుడు నేర్చుకున్నది పెద్దయిన తర్వాత ఉపయోగప డుతుందని అన్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై సిలబస్ లో మరింతంగా ఫోకస్ పెట్టేలా క్యాబినెట్‌లో మా ట్లాడతామని తెలిపారు. బయటకు వెళ్లినప్పుడు బాధితులతో ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రతి పాఠశా లలో యునిసెఫ్ సహకారంతో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకు న్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ సంవత్సరం 500 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో ఈ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్‌లు ఏర్పాటు చేస్తా మని అన్నారు. చిన్నతనం నుంచే ట్రాఫిక్‌పై అవగా హన కల్పించాలని మంత్రి పొన్నం ప్రబాకర్ చెప్పారు.

# శబరిమల ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైన అయ్యప్ప స్వాముల బస్సు

**-డ్రైవర్ రాజు అక్కడికక్కడే మృతి**
**-చెట్టును ఢీ కొట్టి బస్సు ఆగిపోవడంతో తప్పిన పెను ప్రమాదం**

**సైదాబాద్, జనవరి 3 ప్రభాతవార్త:** హైద్రాబాద్ నుంచి శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాముల బస్సు ఘాట్ రోడ్డులో అదుపు తప్పి లోయలోకి దూసుకుపోతూ చెట్టును ఢీ కొట్టి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటనలో బస్సు డ్రైవర్ రాజు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మాదన్నపేటకు చెందిన అయ్యప్ప స్వాములు మూడు రోజుల క్రితం శబరిమల యాత్రకు ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో బయలు దేరారు. పంబా దాటిన తర్వాత ఘాట్ రోడ్డులో వెళ్తుండా శబరిమల మరో 15 కిలో మీటర్ల దూరం ఉందనగా కనమల అట్టివలం వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి బస్సు అదుపు తప్పడంతో లోయలోకి దూసుకువెళ్లింది. అయితే అదృష్ట వశాత్తు బస్సు లోయలోకి పడకుండా రోడ్డు పక్కన భారీ వృక్షాన్ని బలంగా ఢీ కొట్టి ఆగిపోయింది. బస్సులో దాదాపు 25 మంది ఉన్నట్లుగా తెలుస్తుంది. బస్సు చెట్టును ఢీ కొట్టడంతో క్యాబిన్‌లో నిద్రస్తున్న మరో డ్రైవర్ రాజుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సును నడుపుతున్న డ్రైవర్ కూడా గాయాల పాలైనట్లుగా సమాచారం. బస్సులో ఉన్న అయ్యప్ప స్వాముల్లో కొంత మందికి తీవ్ర గాయాలు కాగా మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. 31వ తేది అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లుగా తెలస్తుంది. అనుకోని ప్రమాద సంఘటనతో బస్సులోని అయ్యప్ప మాలధారులంతా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. బస్సు ప్రమాదానికి గురైన విషయం చూసిన ఇతర వాహన దారులు పోలీసులకు సమాచారం అందించి బాధితులను కాపాడడంలో చేయూతనందించారు. సమాచారందుకున్న అక్కడి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. బస్సును క్రేన్ సహాయంతో పక్కకు తీశారు. కాగా ప్రమాద సంఘటన గురించి తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కేరళ ప్రభుత్వ అధికారులతో మాట్లాడారు. ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ రాజు మృత దేహాన్ని పోస్టుమార్టం అనంతరం హైద్రాబాద్‌కు తరలించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. గాయాలకు గురైన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులకు సూచించారు.

# విద్యార్థులు ప్రపంచ యవనికపై రాణించాలంటే బాషా ఎంతో కీలకం

## - గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్చాన్ని అందజేస్తున్న విసి ప్రొ.కుమార్ మొలుగరం

**తార్నాక, జనవరి 3 ప్రభాతవార్త:** విద్యార్థులు ప్రపంచ యవనికపై రాణించాలంటే భాషా నైపుణ్యం అత్యంత కీలకమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఒకప్పుడు మనపై ఆధిపత్యం కోసం ఉపయోగించిన ఇంగ్లీష్ భాష ప్రస్తుతం వృత్తిపరమైన నైపుణ్యాలను ప్రపంచం ముందు వెల్లడించేందుకు అనివార్యంగా మారిందని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు ఇంగ్లీష్ భాషపై పట్టు సాదించడం ద్వారా ఆయా రంగాల్లో రాణించేందుకు సులువవుతుందని చెప్పారు. ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లీష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ సెంటర్ (ఈఎల్‌టీసీ) ద్వారా గిరిజన విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణను గవర్నర్ చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 66 మంది యూజీ చదువుతున్న గిరిజన విద్యార్థులకు ఈ కార్యక్రమంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణ అందించనున్నారు. విద్యార్థులకు ఓయూలో నెలరోజుల పాటు వసతి కల్పించి, శిక్షణ అందించనున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ ఆర్థిక సహాయం అందజేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని ఈ క్లాస్ రూంలో నిర్వహించిన కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గవర్నర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతి, సాధికారత జరిగినప్పుడే వికసిత్ భారత్ లక్ష్యాలు నెరవేరుతాయని చెప్పారు. అన్ని సమస్యలకు విద్య మాత్రమే పరిష్కారం చూపుతుందని అన్నారు. సాధికారత సాధించేందుకు సుస్థిర విద్యాభివృద్ధి ఎంతో ముఖ్యమని అభిప్రాయపడ్డారు. ఓయూతో కలిసి ప్రస్తుతం తొలి అడుగు వేశామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ఈఎల్టీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ, కార్యక్రమ కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ క్రిస్టోఫర్, ప్రొఫెసర్ సవిన్ సౌడ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశిం, గవర్నర్ సంయుక్త కార్యదర్శి భవానీశంకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి,ఓఎస్టీ ప్రొఫెసర్ జితేందర కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.





హకీంపేట్‌లోని సిఐఎస్‌ఎఫ్‌లో పాసింగ్ అవుట్ పేరేడ్‌లో పాల్గొన్న సిఐఎస్‌ఎఫ్ పోలీసుల విన్యాసాలు

# జీడిమెట్ల పారిశ్రామికవాడలో భారీ అగ్నిప్రమాదం..



మంటలను అర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**పేట్ బషీరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త**

జీడిమెట్ల పారిశ్రామికవాడలోని దూలపల్లిలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కెమికల్ గోదాంలో భారీగా మంటలు ఎగిసి పడుతున్నాయి. ఈ క్రమంలో దట్టమైన పొగలు వ్యాపించగా స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతూ తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 2 ఫైరింజన్లతో అక్కడకు చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలు అదుపు చేశారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో దూలపల్లిలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఎలాంటి అనుమతులు లేకుండా కెమికల్ గోదాంను నిర్వాహకులు నడుపుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఈ ఘటనపై ఆరా తీస్తున్నారు.

## నాలుగో అంతస్థుపై నుంచి పడ్డి ఆర్మీ అధికారి మృతి

**నార్సింగి, జనవరి 3 ప్రభాతవార్త :** కాలు జారి నాలుగు అంతస్థుల పైనుంచి కిందపడ్డ ఆర్మీ అధికారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గండిపేట మండలం పుప్పాలగూడ అల్కాపురి కాలనీకి చెందిన శంకర్ రాజ్ కుమార్ ఉత్తరప్రదేశ్ లక్నో ప్రాంతంలో భారత సాయుధ దళాలలో కెప్టెన్ హోదాలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడు నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు లక్నో నుంచి హైదరాబాద్‌లోని తన ఇంటికి వచ్చాడు. 02-01-25 మధ్యాహ్నం 12:45 గంటలకు తన ఇంట్లోని బాల్కాని వద్ద కాలు జారి నాలుగో అంతస్థు పైనుంచి కిందపడ్డాడు. పెద్ద శబ్దం రావడంతో ఇంట్లో ఉన్న అతడి భార్య, పని మనిషి ఇద్దరూ పరుగెత్తుకుంటూ వచ్చి చూశారు. కింద పడి రక్తపు గాయాలతో కొట్టుకుంటున్న శంకర్ రాజ్ కుమార్‌ను గమనించారు. కేకలు వేయడంతో స్థానికులు స్పందించి వెంటనే చికిత్స నిమిత్తం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం 5:19.గంటలకు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని నార్సింగి పోలీసులు తెలిపారు.

## కెసిఆర్‌నగర్‌లో నేరస్థుడి హత్య

**ఉప్పల్, జనవరి 3 ప్రభాతవార్త :** రామంతాపూర్ కెసిఆర్‌నగర్‌లో జైలు నుంచి విడుదల అయిన ఒక పాత నేరస్థుడిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అంబర్‌పేట బాపునగర్ చెందిన మహ్మద్ బషీర్ కుమారుడు మహ్మద్ నబీ (28) పాత నేరస్థుడు. ఇతనికి భార్య ఉంది. అయితే గతంలో అంబర్‌పేట పిఎస్ పరిధిలో జరిగిన ఒక హత్య కేసులో జైలుకు వెళ్లి నెల రోజుల క్రితమే ఇటీవల తిరిగి వచ్చినట్లు తెలిపారు. కాగా శుక్రవారం సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో రామంతాపూర్ కెసిఆర్ నగర్ సమీపంలోని గడ్డి పొలాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా మృతుడు పాత నేరస్థుడిగా గుర్తించారు. గతంలో ఒక హత్య కేసులో జైలుకు వెళ్లి ఇటీవలే తిరిగి ఇచ్చినట్లు తెలిపారు. పథకం ప్రకారం నిర్మానుష ప్రాంతంలోకి తీసుకుని వెళ్లి హత్య చేసి ఉండవచ్చని పోలీసులు పేర్కొంటున్నారు. మల్కాజిగిరి ఎసిపి ఎ.చక్రపాణి, సిఐ ఎలక్షన్‌రెడ్డి, ఇతర సిబ్బంది సంఘటా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తాగునీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, జనవరి 3 ప్రభాతవార్త :** హైదరాబాద్ మహా నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్-1లో కలబ్‌గూర్ నుంచి లింగంపల్లి వరకు గల పిఎస్సీ, ఎంఎస్ పైపులైనుకు జాయింట్ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ లీకేజీలు అరికట్టడానికి మరమ్మతులతో పాటు జంక్షన్ పనులు సైతం చేపట్టనున్నారు. ఈనెల 6వ తేది సోమవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు 7వ తేది మంగళవారం ఉదయం 6 గంటల వరకు ఈ పనులు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో పలు చోట్ల తాగునీటి సరఫరాలో అంతరాయం, కొన్ని చోట్ల లో ప్రెజర్‌తో నీటి సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు. అంతరాయం ఏర్పడే ప్రాంతాలు..ఓ అండ్ ఎం డివిజన్-8: పటాన్‌చెరువు ఇండస్ట్రియల్ ఏరియా, హెచ్‌సియూ, బిహెచ్‌ఈఎల్ టౌన్ షిప్, బిహెచ్‌ఈఎల్ ఫ్యాక్టరీ, ఓ అండ్ ఎం డివిజన్-15 : ఎస్‌బిఐ ట్రైనింగ్ సెంటర్, డోయెన్స్ కాలనీ, హఫీజ్ పేట్, మదీనాగూడ, గంగారం, చందానగర్, లింగంపల్లి, జ్యోతి నగర్, అశోక్ నగర్, ఆర్సీపురం, పటాన్ చెరువు. ఈ నేపథ్యంలో అంతరాయం ఏర్పడే ప్రాంతాల్లోని వినియోగదారులు తాగునీటిని పొదుపుగా వినియోగించుకోగలరని జలమండలి అధికారులు సూచించారు.

## దొంగతనానికి పాల్పడిన వంట మనిషి,క్యాబ్ డ్రైవర్ అరెస్ట్

**యాకుత్‌పుర,జనవరి 3 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలోని నాగాబౌలిలో 16 తులాల బంగారం ఆభరణాలతో పాటు లక్ష రూపాయల నగదును దొంగలించిన వంట మనిషి,కొడుకును శుక్రవారం రెయిన్ బజార్ పోలీసులు అరెస్ట్ చేశారు.నింధితుల వద్ద నుంచి దొంగతనం చేసిన బంగారం,లక్ష రూపాయలనగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీర్‌చౌక్ ఏసిపి ఎన్ఎన్ఎస్‌వి వెంకటేశ్వరరావు విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.యాకుత్‌పురలోని నాగాబౌలి ప్రాంతానికి చెందిన షేక్ జరీనా (45) నాగాబౌలిలోని సయ్యద్ మజరుద్దీన్ ఇంట్లో వంట మనిషిగా పని చేస్తున్నది.కాగా ఈ నెల 2వతేదీన షేక్ జరీనా,తన కుమారుడు షేక్ అర్షాద్ (25 క్యాబ్ డ్రైవర్)తో కలిసి సయ్యద్ మజరుద్దీన్ ఇంట్లోని 16 తులాల బంగారు ఆభరణాలు,లక్ష రూపాయల నగదును దొంగలించారు.వారిద్దరిని రెయిన్ బజార్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.ఈ విలేకర్ల సమావేశంలో రెయిన్ బజాన్ సిఐ రమేష్ నాయక్,అడిషనల్ సిఐ మదన్ లాల్,ఎస్ఐ బి.నరసింహలు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగులకు అండగా ఉంటాం : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**-కిషన్‌రెడ్డితో ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి సమగ్రశిక్ష ఉద్యోగుల ప్రతినిధుల భేటీ**

**బేగంపేట జనవరి 3,ప్రభాతవార్త**

సమగ్ర శిక్ష ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని,కేంద్ర ఉక్కు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి భరోసా ఇచ్చారు.శుక్రవారం దిల్‌కుశ అతిథి గృహంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ డా.చిన్నారెడ్డి ,సమగ్ర శిక్ష ప్రతినిధులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కల్సి వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా సమగ్ర శిక్ష కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద 60శాతం నిధులను ఇస్తుండగా మిగిలిన 40శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి ,వర్కింగ్ ప్రెసిడెంట్ వి.అనిల్‌చారీ ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.రాష్ట్రంలో అక్షరాశ్యత శాతాన్ని పెంచేందుకు సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంతో కృషి చేస్తున్నారని ,చాలీ చాలనీ వేతనాలతో సతమతమవుతున్నామని వారు పేర్కొన్నారు.సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేసిక్‌పే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 60శాతం నిధుల వాటాను కొనసాగించాలని ఉద్యోగులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు.ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు.



ప్రజావాణీలో దిల్‌కుశ అతిధి గృహంలో సమగ్ర ఉద్యోగుల తో సమావేశమైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి.

# బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాలిస్తే కఠిన చర్యలు : కమిషనర్





కాలుష్య నియంత్రణ మండలి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బండ్లగూడ కార్పోరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర.

**నార్సింగి, జనవరి 3 ప్రభాతవార్త :** బహిరంగ ప్రదేశాలలో చెత్తను కాలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కార్యాలయంలో కమీషనర్ శరత్‌చంద్ర కాలుష్య నియంత్రణ మండలికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చడం వలన విషతుల్యమైన వాయువులు వెలువడి వాతావరణం కలుషితం అవుతుంద వివరించారు. ఈ తీరుగానే వెలువడ్డ పొగ కారణంగా దేశ రాజధాని ఢిల్లీవంటి నగరంలో వాతావరణం పూర్తిగా కలుషితం అయ్యిందని, అలాంటి దుర్భర పరిస్థితులు మనవద్ద రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా మన కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకుంటుండడం అభినందనీయమన్నారు. ఇందుకు ప్రజలందరూ సహకరించాలని సూచించారు. ఇక నుంచి బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో ఎక్కడా కూడా చెత్తను బహిరంగ ప్రదేశాల్లో కాల్చవద్దని, ఎవరైనా కాలిస్తే రూ.5.వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మేనేజర్ మంజులత, ఆర్ఓ శివకుమార్, ఏఈఈ రాజ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్లు వెంకట్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు


అంబర్‌పేటలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 3 ప్రభాతవార్త**
అంబర్‌పేట నియోజకవర్గంలో గుంతలు లేని రోడ్లుగా తీర్చిదిద్దుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని బాపునగర్‌లో 18 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ ఇ.విజయ్‌కుమార్ గౌడ్‌తో కలిసి,స్థానిక బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్నటువంటి డ్రైనేజీ, విద్యుత్ దీపాల సమస్యలను పరిశీలించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట్ డివిజన్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,మహిళా నాయకులు,మైనార్టీ నాయకులు, స్థానిక బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### అద్భుతంగా సాగిన 'సప్తస్వరాలలో' సంగీత కార్యక్రమం


'మధురమే సుధాగానం' కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, జనవరి 3 ప్రభాతవార్త:** శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో 'సప్తస్వరాలలో' పేరుతో సంగీత కార్యక్రమం శుక్రవారం జరిగింది. నిర్వాహక సంస్థ అధినేతలు జి.వసుధా, లక్ష్మణమూర్తి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో నిర్వహించిన భక్తిగీతాలాపన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. సప్తస్వరాలలో సప్తవర్ణ శోభలో శృతిలయ తలచినమదిలో పులకించెను రాగఝరులు వంటి పాటలతో గాయనీ గాయకులు అద్భుతంగా గానం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అకాడమి నిర్వహణలో ఎంతో మంది గాయనీ గాయకులు గాయనీ గాయకులుగా రాణించారని నిర్వాహకులు వివరించారు.

## దళిత జన భాంధవుడు భాగ్యరెడ్డి వర్మ
### -మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి


ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి

**చిక్కడపల్లి, జనవరి 3 ప్రభాతవార్త:** తెలంగాణ నేలపై ఆవిర్భవించిన భాగ్య రెడ్డి వర్మ అంబేద్కర్ కంటే ముందుగానే దీనుల ఉద్ధరణ కోసం పోరాడిన దళిత జన బాంధవుడు అని సీ పీ ఏం నాయకుడు, మాజీ శాసన సభ్యుడు నంద్యాల నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహిస్తున్న ఎందరో మహానుభావులు మధురాస్మృతులలో భాగంగా భాగ్యరెడ్డి వర్మ సంస్మరణ సమావేశం గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా నరసింహా రెడ్డి పాల్గొని మాట్లాడుతూ సమాజం లో అణగారిన వర్గాల ప్రజలకు విద్య అందుబాటు లోకి తేవాలన్న లక్ష్యం తో అది హింద్ విద్యాలయం ను హైదరాబాద్ లోని చాదర్ ఘాట్ వద్ద నిర్మించి ఉచిత విద్య అందించిన భాగ్య రెడ్డి వర్మ సదా స్మరణీయులు అన్నారు. అయన నైజాం పాలిత ప్రాంతాల లో వివక్షత కు వ్యతిరేకంగా నిరంతర పోరాటం చేసిన త్యాగ శీలి కానీ చరిత్రలో ఆయనకు తగిన గుర్తింపు రాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిందేంద్ర ఆర్ట్స్ అకాడమీ అధినేత్రి దేవసేన, పుష్పాంజలి రిథమ్ అధ్యక్షుడు బాలాజీ కుమార్, గాయని మంగరాజు రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలిపిన కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు


ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు

**కంటోన్మెంట్,జనవరి 3 ప్రభాతవార్త:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, లోకనాథం, నళిని కిరణ్, అనితా ప్రభాకర్, బిఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు
### -రూ. 46 లక్షల సోత్తు స్వాదీనం

**తార్నాక, జనవరి 3 ప్రభాతవార్త :** విలువైన వస్తువులను చోరిచేసిన నిందితుడిని అరెస్టు చేసి అతని వద్దనుంచి సుమారు రూ. 46 లక్షల సొత్తును స్వాదీనం చేసుకున్న సంఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్‌పెక్టర్ రుద్వీర్ కుమార్ కథనం ప్రకారం. విక్ఎఖో టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ కి చెందిన మెటీరియల్‌ను డీసీఎంలల్లో గగన్ పహాడ్ నుంచి చెర్లపల్లికి మారుస్తున్న క్రమంలో గురువారం రాత్రి వాహనాలను నాచారం పారిశ్రామిక వాడలో పార్కు చేసి ఉంచారు. తిరిగి ఉదయం డ్రైవర్ వచ్చి చూడగా లోడ్‌తో ఉన్న డీసీఎం లేకపోవడంతో ఎవరో గుర్తు తెలియని దొంగలు దీదీలీ మరియు దానిలోని కంపెనీకి చెందిన మెటీరియల్ మొత్తం దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నాచారం ఇన్సెపెక్టర్ రుద్వీర్ కుమార్, డిటెక్టివ్ ఇన్సెపెక్టర్ శ్రీశైలం, ఎస్.ఐ. వెంకటయ్య, నాచారం క్రైమ్ సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి నిందితుడైన లారీ డ్రైవర్ షేక్ నిరంజన్ (37) ను అరెస్టు చేశారు. అతని నుంచి లోడుతో ఉన్న డీసీఎంతో పాటు మెటీరియల్ మొత్తం స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన వాటి విలువ సుమారు రూ. 46 లక్షలు ఉంటుందని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఇంగ్లీష్ యూనియన్ స్కూల్ ఆధ్వర్యంలో సావిత్రిబాయ్‌పూలే జయంతి వేడుకలు


దళిత స్త్రీశక్తి ఆధ్వర్యంలో సావిత్రిబాయ్‌పూలే జయంతి వేడుకలు


అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో సావిత్రి పూలే బాయికి నివాళులర్పిస్తున్న ఎం.వి.ఫౌండేషన్ ప్రతినిధులు


సావిత్రిబాయిపూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నిత్యానందరావు


మణికొండ ప్రభుత్వ పాఠశాలలో సావిత్రీభాయి పూలే జయంతి వేడుకలను జరుపుకుంటున్న దృశ్యం.


నార్సింగి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సావిత్రీభాయి జయంతి వేడుకలలో పాల్గొన్న ఎంఇఓ విజయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు క్యాతం అశోక్ యాదవ్, వినోద్ కుమార్, కౌన్సిలర్ లక్ష్మీ ప్రవళిక కిరణ్ కుమార్ తదితరుల దృశ్యం.

# సావిత్రిబాయిపూలే అందరికీ ఆదర్శం

**ముషీరాబాద్ నియోజకవర్గంలో**
**ముషీరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఇంగ్లీష్‌యూనియన్ స్కూల్ నందు ప్రిన్స్‌పాల్ పి.స్వర్ణలత, కరస్పాండెంట్ పి.గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు క్రిస్టిన్, మోహెది భాను, వందన, స్వప్న పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో బి.జే.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దళిత శక్తి జాతీయ కన్వీనర్ గెడ్డం ఝాన్సీ, పి.ఎస్.ఎన్.మూర్తి, వై.వసుంధర, పి.జే.ఆర్ కళాశాల ప్రిన్స్‌పాల్ విజయ్‌కుమార్, రామలక్ష్మి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో**
**అడ్డగుట్ట,జనవరి 3 ప్రభాతవార్త:** మొదటి మహిళా టీచర్ సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో ఎం.వి.ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు హెడ్ మాస్టర్ అనురాధ పాల్గొని సావిత్రి బాయి పూలే సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు సువర్ణ, జ్యోతి లక్ష్మి, ఉమా, సరిత, హిమ బింధు తదితరులు పాల్గొన్నారు.

**తెలుగు వర్సిటీలో..**
**నిజాంపేట్, జనవరి 3, ప్రభాతవార్త :** దేశంలోని ఆడబిడ్డల చదువుకు శ్రీకారం చుట్టి అనేక మంది మహిళలకు చదువు నేర్పిన ఆదర్శ మహిళే కాకుండా తొలి మహిళా ఉపాధ్యాయినిగా నిలిచిన సావిత్రిబాయి పూలేను సమాజం మరవదని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు తిన్నారు. శుక్రవారం తెలుగు వర్సిటీలోని విధ్యాత్మిక భవన ప్రాంగణంలో నెలకొల్పిన సావిత్రి బాయిపూలే విగ్రహానికి పుష్పమాలను సమర్పించి 194వ జయంతి సందర్భంగా ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుశాఖాధిపతి డా. రత్నశ్రీ, కాంచనపల్లి గోవర్ధన్ రాజు, నవ్యశాఖాధిపతి డా. వనజా ఉదయ్, వివిధ విభాగాల అధ్యాపకులు పెద్ద ఎత్తున విద్యార్థినులు పాల్గొని సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులు సమర్పించారు.

**మణికొండ ప్రభుత్వ పాఠశాలలో**
**నార్సింగి, జనవరి 3 ప్రభాతవార్త :** నేటి తరం యువతులు, మహిళలంతా సావిత్రీభాయి పూల ఆశయ సాధనకు నడుం బిగించాలని మణికొండ మున్సిపల్ కౌన్సిలర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మణికొండ ప్రభుత్వ పాఠశాలలో "సావిత్రీభాయి జయంతి వేడుకలను" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయురాళ్లను సత్కరించారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సావిత్రీభాయి బాలికా, మహిళా విద్యా వ్యాప్తికి తీవ్రంగా శ్రమించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దశరత్ నాయక్, నాయకులు బుద్దోలు శ్రీరాములు, నీలేష్‌దూబే, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాల్‌రెడ్డి, ఏర్పుల కుమార్, లక్ష్మీశ్రీ, నాయకులు శ్రవణ్, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కవిత ధర్నాకు భారీగా తరలివెళ్లిన బండ్లగూడ కార్పొరేషన్ నేతలు

**- బిసిలకు 42.శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే : స్వామిగౌడ్**


బిఆర్ఎస్ నాయకురాలు కవిత చేపట్టిన ధర్నాకు బండ్లగూడ కార్పోరేషన్ నుంచి తరలి వెళ్తున్న బిఆర్ఎస్ నేతలు స్వామిగౌడ్, నాగరాజు తదితరులు

**నార్సింగి, జనవరి 3 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో చేపట్టిన సమావేశానికి బండ్లగూడ కార్పోరేషన్ నుంచి భారీ ఎత్తున బిఆర్ఎస్ నాయకులు తరలి వెళ్లారు. బిఆర్ఎస్ బండ్లగూడ కార్పోరేషన్ అధ్యక్షులు రావులకోళ్ల నాగరాజు నేతృత్వంలో మాజీ శాసన మండలి చైర్మన్ స్వామి గౌడ్,నేతలు రాముడు యాదవ్, ఆర్.ప్రకాశ్, రాజు, మురళీ, పెంటయ్య యాదవ్, సందీప్, కృష్ణ, ప్రవీణ్, దుర్గేష్, శాంతి నాయక్, లక్ష్మమ్మ, మల్లేష్ తదితరులతో పాలు 300.మంది కార్యకర్తలు జై తెలంగాణ... జైజై తెలంగాణ.అంటూ నినాదాలు చేస్తూ సభా వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్, నాగరాజులు మాట్లాడుతూ బిసి కుల గణన చేసి 42.శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేదంటే వచ్చే అన్ని ఎన్నికల్లో బిసిలు తిరుగుబడుతారని హెచ్చరించారు. రిజర్వేషన్లు అమలు చేయకపోతే స్థానిక సంస్థలైన సర్పంచ్, ఎంపిటిసి, జడ్‌పిటిసి, మున్సిపల్, కార్పోరేసన్ ఎన్నికలలో బిసిల తడాఖా చూస్తారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కకుండా చేసి కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పి తీరుతామని పేర్కొన్నారు. రిజర్వేషన్లను పక్కన పెట్టి ఎన్నికలు వెళితే కాంగ్రెస్‌పై బిసిలంతా తిరుగుబాటు చేస్తారని, ప్రజలిచ్చే తీర్పు బడా నాయకుల పోస్టులు కూడా ఊడిపోయే ప్రమాదాలు ఉంటాయని వివరించారు. ఇప్పుడు బిసిలు కొత్తగా ఏమీ డిమాండ్ చేయడం లేదని, అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు.

## వ్యర్థాలతో పూర్తిగా కలుషితమైన హిమాయత్ సాగర్ : సాగర్‌గౌడ్

**- తాగేందుకు పనికిరాని నీటిని బండ్లగూడకు సరఫరా చేయవద్దు**
**- ఇక్కడి ప్రజల ప్రాణాలతో ఆటలాడుకోవద్దు**

**నార్సింగి, జనవరి 3 ప్రభాతవార్త :** శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాలలో నుంచి ప్రజల మల,మూత్రాలు నేరుగా హిమాయత్ సాగర్ జలాశయంలోకి వచ్చి చేరుతున్నాయని, దీని వలన ఈ నీరు పూర్తిగా కలుషితమైందని బండ్లగూడ జాగీర్ కార్పోరేటర్ బి.సాగర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం సోషల్ మీడియా వేదికగా సాగర్‌గౌడ్ మరికొన్ని వీడియోలను విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ పలువురు నిపుణులు ఈ నీటిని పరీక్షించి ఇది ఎన్నిమార్లు శుద్ధి చేసినా తాగేందుకు పనికి రాదని తేల్చారని, ఇలాంటి నీటిని బండ్లగూడ కార్పోరేషన్ ప్రజలకు సరఫరా చేసి, ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడుకోవద్దని జల మండలి అధికారులను కోరుతున్నానని పేర్కొన్నారు. అధికారులకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడు వదులుతున్న కృష్ణానీటి సామర్థ్యంను ఎక్కువ చేసి సరఫరా చేయాలని, కానీ... పూర్తిగా కలుషితమైపోయిన హిమాయత్ సాగర్ జలాశయం నీటిని వదిలే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీతో పాటు వివిధ గ్రామాలకు చెందిన మురుగు కాలువలు నేరుగా హిమాయత్ సాగర్ చెరువులో కలుస్తున్నాయని వివరించారు. ఏడాదంతా హుస్సేన్ సాగర్‌లో నీరుంటుందని, ఫిల్టర్‌బెడ్‌లు ఏర్పాటు చేసి, ఆ నీటిని శుద్ధి చేసి ఎందుకు హైదరాబాద్ ప్రజలకు సరఫరా చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఎందుకంటే ఎన్నిమార్లు శుద్ధి చేసినా ఆ నీరు తాగేందుకు పనికి రాదని నివేదికలున్నాయని, అలాగే హిమాయత్ సాగర్ నీరు కూడా తాగేందుకు పనికి రాదని సాగర్‌గౌడ్ స్పష్టం చేశారు. నేను స్వయంగా శంషాబాద్ మండలంలో పర్యటించగా... లక్ష మంది ప్రజలు నిత్యం వదిలేసే మల,మూత్ర మురుగు నీరంతా నాలాల ద్వారా, ముగురు కాలువల ద్వారా హిమాయత్ సాగర్ జలాశయంలోనే కలుస్తున్నాయి. ఈ నీటిని ఎన్నిమార్లు శుద్ధి చేసినా రంగు మార్చవచ్చు కానీ, దానిలోని హానికారకమైన సూక్ష్మజీవులను నాశనం చేయలేరని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత జల మండలి అధికారులు కూడా ఈ మురుగునీటిని పరిశీలించి, ఫిల్టర్‌బెడ్ పనులు విరమించుకోవాలని, బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నాని సాగర్ గౌడ్ పేర్కొన్నారు.

## "మన గుడి -మన బలం "పోస్టర్ ఆవిష్కరణ..

**హైదరాబాద్, జనవరి 3,ప్రభాతవార్త:**
పార్టీలకతీతంగా హిందువులందరినీ ఐక్యం చేసి సమస్యల పరిష్కారం కోసం ఆవిర్భవించిన విశ్వహిందూ రక్ష పరిషత్ ఆధ్వర్యంలో "మన గుడి మన బలం" పోస్టర్‌ను శుక్రవారం సోమజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. జాతీయ మహిళా అధ్యక్షురాలు, సామాజిక ఉద్యమకారిణి యమున పాఠక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆధ్యాత్మిక శాస్త్రవేత్త పాసర్లపాటి బంగారయ్య శర్మ, విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు, ప్రముఖ ఆర్.టి.ఐ యాక్టివిస్ట్ లక్ష్మణరావు, విశ్వహిందూరక్ష పరిషత్ జాతీయ సంఘటన్ మంత్రి చెరువు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారసత్వ సంపదని సంరక్షించుకునే బాధ్యత ప్రజాస్వామ్య ప్రభుత్వాలపై ఉందన్నారు. ఆలయ భూములు అక్రమార్కుల అరాచకాలకు బలికాకుండా అటు భక్తులు సామాన్య ప్రజలు వ్యవస్థలు అధికారులు అందరి సమన్వయంతో అకుంఠిత దీక్షతో చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. మన ప్రాచీన ఆలయాలను వాటి పూర్వ వైభవాన్ని తిరిగి తేవడంతో పాటు సామాజిక పరివర్తన చైతన్యం వైపు నడిపించేందుకు ప్రతి ఒక్క హిందువు దోహదపడాలని తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూరక్ష పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ రాఘవేంద్రరావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శ్రీమతి శిల్పారెడ్డి, ధర్మ రక్ష పరిషత్ అధ్యక్షుడు దయానంద్, మహిళ ధర్మ రక్షా పరిషత్ అధ్యక్షురాలు కమల, ముఖ్య కార్యదర్శి భవాని, సాహసి డైరెక్టర్ అశ్విని ఆనంద్, మరాఠీ సమాజ్ అధ్యక్షుడు శ్యాంసుందర్ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న యమునాపాఠక్, బంగారయ్యశర్మ, ముక్తేశ్వర్‌రావు, లక్ష్మణ్‌రావు తదితరులు

## చైనీస్ మాంజాలను విక్రయిస్తున్న పన్నెండు మంది అరెస్ట్

**చార్మినార్,జనవరి 3 ప్రభాతవార్త :** నిబంధలనకు విరుద్ధంగా నిషేధించబడిన చైనీస్ మాంజాలను విక్రయిస్తున్న 12 మందిని టాస్క్ ఫోర్సు పోలీసులు అదుపు లోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి 1500 చైనీస్ మాంజాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.హైదరాబద్ పాతబస్తీ పురానీహవేలిలోని టాస్క్ ఫోర్సు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నగర టాస్క్ ఫోర్సు అడిషనల్ కమిషనర్ అందె శ్రీనివాసరావు మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలు మేరకు సౌత్ జోన్ టాస్క్‌ఫోర్సు,సౌత్ జోన్,సౌత్ ఈస్ట్ జోన్, సౌత్ వెస్ట్ జోన్‌ల పోలీసులు కలిసి పలు ప్రాంతాలలో స్పెషల్ డ్రైవ్ జరిపారని,అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా నిషేధించబడిన చైనీస్ మాంజాలు అమ్ముతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నామని,1500 చైనీస్ మాంజాలను సీజ్‌చేశామని తెలిపారు.ఢిల్లీ, గుజరాత్, ముంబాయి నుంచి హైదరాబాద్‌కు ట్రాన్స్‌ఫోర్టుల ద్వారా చైనీస్ మాంజాలు వస్తున్నాయని,అక్రమంగా చైనీస్ మాంజాలు విక్రయించే వారికి ఐదు నుంచి ఏడు సంవత్సరాలు జైలు శిక్షతో పాటు లక్ష రూపాయలు వరకు జరిమానా కూడ విధించే అవకాశం ఉందని ఆయన తెలియజేశారు.గత సంవత్సరం 37 లక్షల రూపాయల విలువ చేసే చైనీస్ మాంజాలను.ఈ సంవత్సరం పదిహేను లక్షల రూపాయలు విలువ చేసే మాంజాలనుసీజ్ చేయటం జరిగిందని ఆయన తెలియజేశారు.చైనీస్ మాంజాలు చాలా ప్రమాద కరమైనవని,ప్రజలు చైనీస్ మాంజాలను వాడవద్దని,మన దేశానికి చెందిన మాంజాలను మాత్రమే వాడాలని,ఎవరైనా చైనీస్ మంజాలు విక్రయిస్తే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగానిషేధించబడిన చైనీస్ మాంజాలను విక్రయించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని,ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని టాస్క్ ఫోర్సు అడిషనల్ కమిషనర్ అందె శ్రీనివాసరావు తెలిపారు.ఈ విలేకర్ల సమావేశంలో దక్షిణ మండలం టాస్క్‌ఫోర్సు సిఐ రాఘవేంద్రరావు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.


వివరాలను వెల్లడిస్తున్న నగర టాస్క్ ఫోర్సు అడిషనల్ కమిషనర్ అందె శ్రీనివాసరావు

### మున్నూరు కాపులు అన్ని రంగాలలోను అభివృద్ధి సాధించాలి


కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్,పాతనగర మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు

**చార్మినార్,జనవరి 3 ప్రభాతవార్త :** రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పాతనగర మున్నూరు కాపు సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పాతనగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆకుల శ్రీ రాములు మాట్లాడుతూ మున్నూరు కాపులు అన్ని రంగాలలోను మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆకుల శ్రీ రాములు,ప్రధాన కార్యదర్శి బిట్లహంసరాజ్, ఉపాధ్యక్షులు దేవరశెట్టి ప్రభాకర్,కసారపు చంద్ర కుమార్,పల్లే శ్రవణ్ కుమార్,పోసు కృష్ణ,కోశాధికారి మామిడి నర్సింగ రావు,కార్యదర్శి కె.శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

### కన్నులపండువగా అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవం

**రవీంద్రభారతి, జనవరి 3 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో ప్రఖ్యాత సింగిడి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్యాలతో అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవం, కళాకారులకు విశిష్ట పురస్కారాల ప్రదానోత్సవం కన్నులపండువగా నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డిఆర్‌కె విశ్వకర్మ తెలిపారు. రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగే ఈ కార్యక్రమానికి అతిథులుగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, క్రీడాశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, రెవిన్యూ, హౌసింగ్, పౌర సంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడిహరికృష్ణలతోపాటు సింగిడి అంతర్జాతీయ ప్రతినిధులు నారాయణస్వామి-మారిషస్, విశ్వేశ్వర్ కలవల-అమెరికా, శ్రీహరి-ఆస్ట్రేలియా, కిశోర్-ఇటలీ, జయనందన-శ్రీలంక, శ్రీదేవి-మలేషియా తదితరులు పాల్గొని అంతర్జాతీయ కళాకారులను ఘనంగా సత్కరించి విశిష్ట పురస్కారాలు ప్రదానం చేస్తారని వివరించారు. ఈ అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవంలో శ్రీలంక సంప్రదాయ నృత్యాలు, కెనడాకు చెందిన మందాకినిచే శాస్త్రీయ నృత్యం, కథక్ నృత్యగురు ఆధ్వర్యం లో వారి శిష్యబృందంచే కథక్ బృందనృత్యం, ఆర్‌బివిఆ ర్‌ఆర్ కాలేజీ విద్యార్థినులచే శాస్త్రీయ, సంప్రదాయ, జానపద నృత్యప్రదర్శనలు జరుగుతాయని విశ్వకర్మ పేర్కొన్నారు.

## ఆధునిక విద్య ద్వారానే స్త్రీకి విముక్తి
### -గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్


నివాళులు అర్పిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, జనవరి 3 ప్రభాతవార్త:** ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని చాటిచెప్పిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో శుక్రవారం బిజెపి డివిజన్ ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.వేడుకల్లో ముఖ్య అతిథిగా పావని వినయ్ కుమార్ పాల్గొని బీజేపీ శ్రేణులతో కలిసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు రత్న సాయి చంద్ ,ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్ , సీనియర్ నాయకులు దామోదర్, శ్రీకాంత్, జుళిగి రాజు,పాల శ్రీనివాస్,నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

**హైదరాబాద్, జనవరి 3 ప్రభాతవార్త**
జలమండలి పాలక మండలి సమావేశం నిర్వహించడంపై బోర్డు టీజీవో శాఖ హర్షం వ్యక్తం చేసింది. అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జనరల్ సెక్రటరీ చంద్రజ్యోతి మట్లాడుతూ బోర్డు ఆవిర్భావం తర్వాత ఏటా పాలక మండలి సమావేశాలు జరిపి సమస్యలు పరిష్కరించే వాళ్లు అని తెలిపారు. అయితే గత 11 ఏళ్లుగా ఒక్క మీటింగ్ కూడా నిర్వహించలేదన్నారు. కానీ కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరమే మీటింగ్ నిర్వహించడం సంతోష దాయకమన్నారు. పెండింగ్ సమస్యల్ని, నిర్ణయాలు ఆమోదించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. జలమండలి ఆర్థిక స్వావలంబన సాధించడం దిశగా తీసుకున్న నిర్ణయాలు హర్షణీయమ అన్నారు.

## తపస్ డైరీని ఆవిష్కరించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 3 ప్రభాతవార్త**
తపస్ నిర్మాణాత్మకంగా బాధ్యతగా రాష్ట్రంలో పని చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు హన్మంత్‌రావు అధ్యక్షతన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)-2025 డైరీని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవియన్ రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకంగా ప్రజా ప్రతినిధులు ఉండరు, కేవలం ఉపాధ్యాయ వర్గాలకు ఆ సదుపాయము ఉన్నదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో నిబద్దత గల జాతీయ వాదులను గెలిపించుకోవాలన్నారు. చట్టాల రూపకల్పనలో తపస్ భాగస్వామ్యం పెరగాలన్నారు. తెలంగాణ ఉపాధ్యాయ వర్గాలు, సంఘాలు ఉపాధ్యాయ పక్షంగా జాతీయవాద సంఘానికి మద్దతుగా నిలబడాలని కోరారు. 317 జిఓ పరిష్కారం కోసం, జీతాల కోసం, ఇతర అనేక సమస్యల పరిష్కారం కోసం ఈ ప్రభుత్వధోరణిని ఎండగట్టాలంటే తపస్ ఏకైక ప్రత్యామ్నాయం అని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి అతి పవిత్రమైనది ఈ బాధ్యతలు పవిత్ర భావనతో నిర్వహించడంలో తపస్ కీలక భూమిక పోషిస్తుంది అని ఉపాధ్యాయ లోకం తపస్ సంఘానికి తమ మద్దత్తు ఇవ్వాలి. నూతన జాతీయ విద్యా విధానం తెలంగాణలో అమలు అయ్యేలా ఉపాధ్యాయ భూమిక సమర్ధవంతంగా నిర్వహించేలా కృషి చేయాలి. పెండింగ్ సమస్యల పరిష్కారంలో తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి నవాత్ సురేష్, ప్రతినిధి విష్ణు వర్ధన్ రెడ్డి, సహాధ్యక్షులు నరేందర్‌రావు, పాపిరెడ్డి, ఉష, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య, రామకృష్ణ రెడ్డిలు పాల్గొన్నారు.

## వీక్షణం సంపాదకులు వేణుగోపాల్‌పై దుష్ప్రచారం
### -భావ ప్రకటనా స్వేచ్ఛ, పరిశోధనలపై దాడిని ఖండించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** వీక్షణం సంపాదకులు ఎన్ వేణుగోపాల్ మీద సోషల్ మీడియాలో చేస్తున్న దాడిని సీపీఐ (ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. తమకు నచ్చని పుస్తకాన్ని అమ్ముతున్నారనే పేరుతో వేణుగోపాల్‌పై కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మండిపడ్డారు. తిరుమల తిరుపతి దేవస్థానం మీద పరిశోధనలు జరిపిన ఒక చరిత్రకారుడు, అది పూర్వం బౌద్ధ క్షేత్రం అనీ, దానికి ఆధారాలున్నాయని 40 సంవత్సరాల క్రితం పుస్తకం విడుదల చేశారని.. అది ఇప్పుడు తెలుగులో వెలువడిందన్నారు. హైద్రాబాద్‌లో జరుగుతున్న బుక్ ఎగ్జిబిషన్‌లో ఆ పుస్తకం అమ్మకానికి పెట్టడాన్ని కొందరు ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఇటువంటి చర్యలు భావ ప్రకటనా స్వేచ్ఛ మీద, పరిశోధనల మీద దాడి అని తమ్మినేని విమర్శించారు. ఆ పుస్తకాలలో చెప్పిన విషయాలపై అభ్యంతరాలున్నవారు.. వాటిని ఖండిస్తూ మరో పుస్తకం రాయవచ్చు.. లేదా ప్రకటనలు చేయవచ్చు.. కానీ ఒక మతానికి చెందినవారిని రెచ్చగొట్టి దాడులకు ప్రోత్సహించటం ప్రమాదకరమన్నారు. ఇలాంటి చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలనీ.. వాటిని ఖండించాలనీ ప్రజలకు, ప్రజాస్వామ్యవాదులకు తమ్మినేని విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో ఇలాంటి క్యాంపెయిన్ చేస్తున్న వారి మీద తక్షణం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఇప్పటికే గౌరీ లంకేష్, ప్రొఫెసర్ ఎంఎం కల్బుర్గి, నరేంద్ర దబోల్కర్, గోవింద పన్సారే వంటి మేధావులను ఇలాంటి శక్తులు హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీనియర్ జర్నలిస్టు తులసిచందుపై కూడా ఇదే పద్ధతిలో దాడులకు ఉసి గొలుపుతూ ట్రోలింగ్ చేస్తున్నారని.. శాస్త్రీయ విమర్శలకు తట్టుకోలేనివారు, మతాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే శక్తులు మాత్రమే ఇలాంటి చర్యలకు పాల్పడతారని... ఇలాంటి స్వార్ధపరుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తమ్మినేని అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతి..

**పేట్ బషీరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త**
రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం 7:30గంటల సమయంలో జీడిమెట్ల విలేజ్‌లోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ దగ్గర గుర్తు తెలలియని ఇన్నోవా కారు (ఎంహెచ్15 సిఎక్స్4392) నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టగా అటుగా వెళ్తున్న డీసీఎం టిఎస్12 యూఏ0481ను ద్విచక్ర వాహనం బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర రక్తస్రావంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి విశ్వనాథ్ శ్రవణ్ కుమార్‌గా పోలీసులు గుర్తించారు. విశ్వనాథ్ బాలానగర్‌లోని హెచ్ఏఎల్‌లో ఉద్యోగి, ఆయన రుద్ర బృందావన్, జయభేరి పార్క్, కొంపల్లిలో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు ఇన్నోవ కారును గుర్తించేందుకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## భవనం పై నుండి పడి రియల్‌ఎస్టేట్ వ్యాపారి మృతి

**ఉప్పల్, జనవరి 3 ప్రభాతవార్త :**
భవనం పైనుంచి కింద పడి ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి దుర్మణం చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ శాంతినగర్‌లో నివసించే బింగి బాబ్జీగౌడ్ అలియాస్ బింగి కార్తీక్‌గౌడ్ (45) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అయితే శుక్రవారం ఉదయం భవనం మూడో అంతస్థు నుంచి నాలుగో అంతస్థుకు వాకింగ్ కోసం వెళ్లినట్లు తెలిపారు. వాకింగ్ చేస్తూ బిపి పెరిగి ప్రమాదవశాత్తు పై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య స్వప్న, ఇద్దరు కుమారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కల్వర్టు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



కల్వర్టు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**అల్వాల్, జనవరి 3 ప్రభాతవార్త:** అభివృద్ధి సకాలంలో పూర్తి చేయించే బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని భూదేవినగర్ గుడిసెలు సమీపంలో 36లక్షలు వ్యయంతో ఏర్పాటు చేస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అభివృద్ధి పనులు సుధీర్ఘ కాలం ప్రజల అవసరాలను తీర్చే విధంగా ఉండాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కల్వర్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, దేవయ్యగౌడ్, నరేష్, సూర్య, ప్రభాకర్, జనార్ధన్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయండి : కార్పొరేటర్ జితేందర్‌నాథ్



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

**అల్వాల్, జనవరి 3 ప్రభాతార్త:** ప్రజావసరాలు మేరకు అభివృద్ధిని నిరంతరాయంగా కొనసాగిస్తామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శివసాయి ఎన్‌క్లేవ్‌లో 30లక్షలు వ్యయంతో కొనసాగుతున్న అంతర్గత రోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. నాణ్యతతో పాటుగా సకాలంలో కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇ రవళి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అఫ్రోజ్ కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గౌడ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ..



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నిజాంపేట్, జనవరి 3, ప్రభాతవార్త**

కేవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిజాంపేట జర్నలిస్ట్ కాలనీలోని వినాయక ఉత్సవ వేదిక వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి నివాస్ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, టీయూడబ్ల్యుజే (143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతీసాగర్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొలిపాక వెంకట్, కోశాధికారి ఒర్సు లింగస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షులు ముక్కర్ల లాలయ్య, చారి, ఉపాధ్యక్షులు రాముయాదవ్, పోరండ్ల మల్లికార్జున్, గట్ల శ్రీనివాస్, ముక్క దేవేందర్ గుప్తా, సలహాదారులు టేకుల సుధాకర్‌రెడ్డి, దామెర జగదీశ్వర్ గుప్తా తదితరులు హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ మీడియా రంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న భవ్య టీవీ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు గోవిందావు, మందడి మారుతీకుమార్, కోట కృష్ణారావు, రమేష్, హబీబ్, కుమార్, అశోక్, మేడ్చెల్ జర్నలిస్టు తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రి బాయి పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



బోయిన్‌పల్లిలో ఉత్తమ టీచర్‌ను సన్మానిస్తున్న జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్, జనవరి 3 ప్రభాతవార్త:** చదువు నిరాకరించబడిన అందకారం అజ్ఞానంలో మహిళలు దళిత బహుజనులకు ఉన్నత చదువులు చదివించేందుకు మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే అని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపనప్రతాప్ తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని శుక్రవారం 1వ వార్డు బాపూజీ నగర్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలోని పనిచేస్తున్న మహిళా టీచర్లకు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి ఉప విద్యా శాఖ అధికారి బాలునాయక్, బోయిన్‌పల్లి వి.ఆర్.ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ నంద కిషోర్, టీచర్లు వీరలక్ష్మి, వాని శ్రీ, పద్మవతి, సరిత, నాయకులు అజిత్ శ్రీకాంత్, షకీబ్, మౌలా తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలిపిన డిసి సమ్మయ్య



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య

**అడ్డగుట్ట, జనవరి 3 ప్రభాతవార్త:** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను శుక్రవారం జిహెచ్ఎంసి బేగంపేట్ సర్కిల్ సమ్మయ్య పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ఇంజనీర్లు సుదర్శన్, అంజనేయులు, చంద్రశేఖర్, చైతన్య, మాజీ కార్పోరేటర్ అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే తలసానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## జెబిఎస్ వద్ద గుర్తు తెలియని మృతదేహం

**కంటోన్మెంట్, జనవరి 3 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ జూబ్లీ బస్టేషన్ సమీపంలోని పి.జె.ఆర్.విగ్రహం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మృతుడి అచూకీకి సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే మారేడ్‌పల్లి పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ నోముల వెంకటేశ్ తెలిపారు. మృతుడు ముస్లిం మైనార్టీకి చెందిన వాడు అయి ఉంటాడని పోలీసులు తెలిపారు. ఈ కేసును ఎస్ఐ లక్ష్మి నారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

# చిత్రపురి సొసైటీ అక్రమాలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలి

**- ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్**

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:**

వేల కోట్ల కుంభకోణానికి పాల్పడ్డ హైదరాబాద్, ఖాజాగూడ చిత్ర పురి కాలనీ సొసైటీ అవినీతి కమిటీ సభ్యత్వాలు రద్దు చేసి వారి ఆస్తులు జప్తు చేయాలి ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. తెలుగు సిని వర్కర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అక్రమాలు తెలుసుకొని శుక్రవారం చిత్ర పురి కాలనీ ని సందర్శించి కమిటీ నేతలు అక్రమంగా అమ్ముకున్న భూములను, ప్లాట్ లను డాక్టర్ దిడ్డి సుధాకర్ పరిశీలించి బాధితుల నుండి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సినీ కార్మికులు ఇళ్ళు, ప్లాట్ లు కోసం విడతల వారి డబ్బు చెల్లించిన తర్వాత వారికీ కేటాయించకమరొకరికి అక్రమంగా అమ్ముకోవడం దుర్మార్గమన్నారు. చిత్ర పురి అవినీతి కమిటీకి సపోర్ట్ చేస్తున్న కో ఆపరేటివ్ అధికారులపై సస్పెండ్ చేసి, ఆఫిషల్ ఫైవ్ మెన్ కమిటీ కాకుండా అడ్ హాక్ కమిటీ ని ప్రభుత్వమే నియమించాలని దీనితో పాటు చిత్ర పురి సొసైటీ అక్రమాలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలని అయన డిమాండ్ చేసారు. అన్యాయానికి గురైన వందలాది సినీ కార్మికుల భాదితుల పోరాటానికి ఆమ్ ఆద్మీ పార్టీ అండగా ఉంటుందని, వారు చేస్తున్న పోరాటానికి మద్దతుగా జనవరి 6 న హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో ఆమ్ ఆద్మీ పార్టీ అఖిల పక్ష రౌండ్ టేబిల్ సమావేశం నిర్వహిస్తుందని డాక్టర్ దిడ్డి సుధాకర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత మద్దినేని రమేష్, ఆప్ యువజన విభాగం అధ్యక్షులు విజయ్ ముల్లంగి, మహిళా విభాగం అధ్యక్షులు నర్సింగ్ యమునా గౌడ్, డాక్టర్ విభాగం అధ్యక్షులు లక్ష్మీ నాయుడు, అధికార ప్రతినిధి జావీద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.




చిత్రపురికాలనీలో పర్యటిస్తున్న దిడ్డి సుధాకర్, రమేష్, యమునాగౌడ్, ముల్లంగి తదితరులు

## అక్రమ పార్కింగ్‌తో ఆర్టీసీ ప్రయాణానికి ఇబ్బంది

**-ఈ రూట్‌లో బస్సు నడపలేమని అంటున్న ఆర్టీసీ సిబ్బంది**



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఆర్టీసీ సిబ్బంది

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 3, ప్రభాతవార్త**

ఆల్విన్ కాలనీ లాస్ట్ బస్ స్టాప్ నందు కార్లు బైకులు లారీలు, ఇతర వాహనాలు అక్రమంగా పార్కింగ్ చేయడంతో, ఆర్టీసి బస్సులు నడపడం ఇబ్బందిగా వుంది మేము నడపలేము అని ఆర్టీసీ సిబ్బంది శుక్రవారం ఆల్విన్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కొండారెడ్డికి తెలియజేశారు. ఈ ఆదివారములోగా మీరు చర్యలు తీసుకోకపోతే సోమవారం నుండి బస్సులు నడపలేమని ఆర్టీసీ బస్సు సెకండ్ మేనేజర్ తెలియజేశారు. ఈ మూడు రోజులు చూసిన తర్వాత బస్సులు రద్దు చేస్తామని అంటున్నారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ఈ లాస్టు బస్సు స్టాప్ జాగా ఎవరిది కాదు కాలనీ వాసులు అందరిదీ. కనుక దీనిపై కాలని వాసులందరూ స్పందించి దీనిని కాపాడుకోవడానికి నాతో కలసి రావలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, కూకట్ పల్లి ఆర్టీసి డిపో మేనేజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## వెటరన్ ఎయిర్ వారియర్స్‌సేవలు ఎనలేనివి : ఎమ్మెల్యే శ్రీగణేష్



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు జ్ఞానిపకను అందజేస్తున్న దృశ్యం

**కంటోన్మెంట్, జనవరి 3 ప్రభాతవార్త:** బొల్లారం లోని కళాసిగూడలో వెటరన్ ఎయిర్ వారియర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు నూతనంగా నిర్మించుకున్న మీటింగ్ హాల్‌ను ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. సైన్యంలో చేరి దేశానికి సేవచేసి రిటైర్ అయిన వెటరన్ ఎయిర్ వారియర్స్ వారి కోసం ఒక మీటింగ్ హాల్ నిర్మాణం కోసం ఎంతో కాలంగా ప్రయత్నించారని, ఎంతో పోరాటం చేసి చివరికి ఇప్పుడు నిర్మాణం పూర్తిచేసుకున్నారని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఇందులో కొంత తన పాత్ర కూడా ఉన్నందుకు సంతోషంగా ఉందన్నారు. వెటరన్స్ దేశానికి ఎంతో సేవచేసి రిటైర్ య్యారని, వారి అనుభవం, జ్ఞానం సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధిలో ఎక్కడ అవసరమో అక్కడ వారి సహాయసహకారాలు తప్పక తీసుకుంటాం అన్నారు. అలగే వెటరన్స్ కోసం కూడా తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వ నిధులతో పాటు అవసరమైతే తాను స్వయంగా నిధులు కేటాయిస్తానని హామి ఇచ్చారు. ఆ తరువాత ఎమ్మెల్యే కళాసిగూడలోని, హరిటమ్ కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు కాలనీ వాసులు వివరించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ మెంబర్ లోకనాథం బోయిన్పల్లి మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## బిసి మహాసభకు తరలివెళ్లిన ఓ.యూ బీఆర్ఎస్వీ నేతలు



ఓ.యూ నుంచి సభకు వెళ్లుతున్న బీఆర్ఎస్వీ నేతలు

**తార్నాక, జనవరి 3 ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ పేరుతో బలహీన వర్గాలకు బలమైన వెన్నుపోటు పొడిచిందని బీఆర్ఎస్వి నాయకులు ఆరోపించారు. సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం ఇందిరా పార్క్ వద్ద ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీమహా సభకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బిఆర్ఎస్వి స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కోతి విజయ్ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ బీసీ కులాలు కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల మాదిరిగా మళ్లీ తెలంగాణ బీసీలను కూడా మోసం చేయకుండా అందరం అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను కాంగ్రెస్ నాయకులు ప్రకటించారని, అధికారం వచ్చిన ఆరు నెలల లోపే బీసీ కుల గణన అని చెప్పి కేవలం అసెంబ్లీ తీర్మానం తోనే సరిపెట్టరాన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ మేరకు రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ప్రభుత్వం ఎన్నికలకు నిర్వహించడం పై ఆలోచన చేయాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ ఈకార్యక్రమములో బీఆర్ఎస్వీ నాయకులు కందుల మధు, కొంపెల్లినరేష్, మబ్బు కర్ణాకర్, రవికిరణ్, క్రాంతి, యదాక్రాంతి తో పాటు పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్, జనవరి 3 ప్రభాతవార్త :** విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 4వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు సాలార్‌జంగ్ మ్యూజియం సబ్ స్టేషన్ పరిధిలోని నయాపూల్, పటేల్ మార్కెట్, బిజి మార్కెట్, రికాబ్‌గంజ్, ఫత్తర్‌గట్టి, పంజేషా, కాలీకమాన్, మీరాలం మండి, అలీజాకోట్ల, లక్కడ్‌కా కోట, పాత కమిషనర్ కార్యాలయం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు చార్మినార్ సిబిడి అధికారులు తెలిపారు.

## మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం..



ఉపాధ్యాయుల సన్మానిస్తున్న కోల రవీందర్ ముదిరాజ్

**జీడిమెట్ల, జనవరి 3, ప్రభాతవార్త**

సావిత్రి పూలే జన్మదిన సందర్భంగా సూరారం కాలనీ జిల్లా పరిషత్ పాఠశాలలో అక్కడ పనిచేస్తున్నటువంటి 22 మంది మహిళా ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించడం జరిగింది. వారికి పూలమాలతో సన్మానించి వారికి పండ్లు కూడా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ పాల్గొని ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సన్మార్గంలో నడిచే విధంగా జ్యోతిరావు పూలే రచించినటువంటి నవలలు అందిచాలని సూచించారు. మంచి బోధన చేసి ఈ పాఠశాలకు మంచి పేరు తెచ్చే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ఇక్కడున్నటువంటి ఉపాధ్యాయులు అందరూ కూడా మంచిగా పాఠశాల చెపుతున్నట్టుగా గ్రామంలో కాలనీలో చెప్పుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి, సి జావిద్, మల్లికార్జున, కరుణ, నాగరాజు , సత్యనారాయణ, మహేష్, పుణ్యవతి, రమణి, రవి కుమార్, రక్షిత, లక్ష్మణ్, చంద్రశేఖర్, వెంకట్రావు, మాధవి, సంపూర్ణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీని నియంత్రించాలి

**టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా**



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

**ముషీరాబాద్, జనవరి3, ప్రభాతవార్త:** రానున్న సంక్రాంతి పడుగ సందర్భంగా గ్రామాలకు వెళ్లే ప్రజల నుండి అధిక ధరలు వసూలు చేసే ఫ్రైవేట్ ట్రావెల్స్ దోపిడీని నియంత్రించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. శుక్రవారం లోయర్‌ట్యాంక్ బండ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు సరిపడా బస్సులను కేటాయించకపోవటం వల్ల పండుగల సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మూడు వేల రూపాయల టిక్కెట్లు ఆరు వేలు చేసి దోచుకుంటూ ఉన్నా ప్రభుత్వం చోద్యం చూస్తోంది తప్ప స్పందించటం లేదని ఆరోపించారు. ప్రభుత్వ బస్సుల సంఖ్య పెంచి, అధిక సంఖ్యలో బస్సులు నడిపి ఆర్టీసీని కాపాడాల్సిన ప్రభుత్వం తనకేమీ పట్టనట్లు వ్యవహరించటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే దీనిపై దృష్టి పెట్టి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

## చైనీస్ మాంజాలు విక్రేతలపై చర్యలు తీసుకోవాలి



సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి కాంతిలాల్ పాటిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నగేష్

**చార్మినార్, జనవరి 3 ప్రభాతవార్త :**

చైనీస్ మాంజాలను నిషేధించాలని, నిబంధనలకు విరుద్ధంగా చైనీస్ మాంజాలను విక్రయించే వారిపై చట్ట పరమైన చర్యలుతీసుకోవాలని కోరుతూ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నగేష్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు సౌత్ ఈస్ట్‌జోన్ డిసిపి కాంతిలాల్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జంగమ్మెట్ ప్రాంతానికి చెందిన కళావతి అనే వృద్ధురాలు డిసెంబరు నెల 29వ తేదీనఫలక్‌నుమాలోని రైతు బజార్‌కు వెళుతున్న సమయంలో మాంజా కాళ్లను కోసుకోవటంతో రెండు నరాలు దెబ్బ తిన్నాయని, కళావతి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారని నగేష్ డిసిపికి అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు. చైనీస్ మాంజాలను విక్రయించే వారిపై చట్ట పరమైన చర్యలు తీసు కుంటామని డిసిపి కాంతిలాల్ పాటిల్ తెలియజేశారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి.మధుమోహన్ ,రవి, సందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల్ల రామక్రిష్ణను అభినందిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

# అభివృద్ధి పనుల దృష్ట్యా నిజాంపేట్‌లో ట్రాఫిక్ మళ్లింపు

**నిజాంపేట్, జనవరి 3, ప్రభాతవార్త**

కృష్ణా క్లాసిక్ వద్ద హోలిస్టిక్ హాస్పిటల్ సమీపంలో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం, ఎస్‌డబ్ల్యూడి రీమోడలింగ్ దృష్ట్యా 1229/69/ఏ నుండి హైదర్‌నగర్‌లోని నిజాంపేట్ రోడ్డు వరకు, వార్డు నెం.123, కూకట్‌పల్లి సర్కిల్24, జీహెచ్ఎంసీ పరిధిలో ట్రాఫిక్‌ను సులభతరం చేయడానికి, ఈ నెల 04 నుండి 15 రోజుల పాటు కింది మార్గాలలో రద్దీ ఉంటుందని ట్రాఫిక్ అధికారులు తెలిపారు. ఈ మేరకు నిజాంపేట్ ఎక్స్ రోడ్డు నుండి నిజాంపేట్ గ్రామానికి, హైదర్‌నగర్ నుండి నిజాంపేట్ గ్రామం వైపు వచ్చే ట్రాఫిక్‌ను జిపిఆర్ సినిమాస్ ఎడమ మలుపు కోనసీమ టిఫిన్ సెంటర్ ఎడమ మలుపు కొలన్ రాఘవ రెడ్డి ఫంక్షన్ హాల్ నిజాంపేట్ గ్రామం వద్ద మళ్లిస్తారు. హైదర్ నగర్ నుంచి నిజాంపేట్ వైపు వచ్చే ట్రాఫిక్ అడ్డగుట్ట ఎడమ మలుపు కోనసీమ టిఫిన్ సెంటర్ ఎడమ మలుపు కొలన్ రాఘవరెడ్డి ఫంక్షన్ హాల్‌నిజాంపేట్ గ్రామం రౌండ్ ది క్లాక్ వద్ద దారి మళ్లిస్తారు. నిజాంపేట్ గ్రామం నుండి నిజాంపేట్ ఎక్స్ రోడ్డు వరకు నిజాంపేట్ గ్రామం నుండి నిజాంపేట్ ఎక్స్ రోడ్డు వైపు వచ్చే ట్రాఫిక్ కొలన్ రాఘవ రెడ్డి ఫంక్షన్ హాల్ ఎడమ మలుపు తులసీనగర్ ఎక్స్ రోడ్ కుడి మలుపు హెచ్ ఎంటి రామాలయం జెఎన్‌టియు వద్ద మళ్లించబడుతుంది.

సాధారణ ప్రజలు మీ ప్రయాణాన్ని తదనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని, ట్రాఫిక్ ఉచిత ప్రవాహాన్ని నిర్ధారించడంలో ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అభ్యర్థించారు.

# అమెరికా క్రికెట్ బోర్డు చైర్మన్‌కు టిడిసిఎ సత్కారం

**-తెలంగాణ క్రికెట్ అభివృద్ధికి అందరూ సహకరించాలి**

**-టిడిసిఎ వ్యవస్థాపక అధ్యక్షులు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి**



వేణురెడ్డిని సన్మానిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి, శివసేనారెడ్డి తదితరులు

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:**

తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధికి అందరూ సహకరించాలని, గ్రామీణ క్రికెటర్లకు సైతం జాతీయ స్థాయిలో అవకాశాలు దక్కేందుకు తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘానికి (టీడీసీఏ) బీసీసీఐ గుర్తింపు ఇవ్వాలని టీడీసీఏ వ్యవస్థాపక అధ్యక్షులు, శాట్ మాజీ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అమెరికా క్రికెట్ బోర్డు చైర్మెన్ పిసికె వేణు రెడ్డిని శాట్ చైర్మెన్ కే. శివసేనా రెడ్డితో కలిసి టీడీసీఏ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా టీడీసీఏ 2025 క్యాలెండర్, అండర్16 టోర్నమెంట్ ట్రోఫీలను ఆవిష్కరించారు. తెలంగాణ బిడ్డ అగ్రరాజ్యం అమెరికా క్రికెట్ బోర్డు చైర్మెన్‌గా ఎదగటం గర్వించగదగిన విషయం. గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధి కోసం టీడీసీఏ కష్టపడుతోందన్నారు. శాట్స్ చైర్మెన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని తెలిపారు. అమెరికాలో క్రికెట్‌ను ఐసీసీ గత ఐదారేండ్లలోనే గుర్తించిందని అంతకుముందు, స్వచ్ఛందంగానే ఆట కోసం పని చేశామని తాను చైర్మెన్‌గా ఉన్న సమయంలోనే అమెరికా జట్టు ఐసీసీ టీ20 వరల్డ్‌కప్‌కు ఆతిథ్యం ఇవ్వటం, రానున్న ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించటం సంతృప్తి అందించాయియని తెలంగాణలోనూ గ్రామీణ క్రికెట్ పురోగతి సాధించాలని కోరుకుంటున్నాను అని వేణు రెడ్డి పిసికె ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఎస్‌జెఎఫ్ చైర్మెన్ రామిరెడ్డి, పెటా టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బి. రాఘవరెడ్డి, సురేందర్ రెడ్డి, టీఎన్జీఓ రాష్ట్ర కార్యదర్శి ముజీబ్, సినీ నటుడు శ్రీధర్, ప్రవాస తెలంగాణీయులు, తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) జిల్లా కన్వీనర్లు, క్రికెటర్లు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై అలుపెరగని కృషి : టేకుల ప్రవీణ్ రెడ్డి

**నిజాంపేట్, జనవరి 3, ప్రభాతవార్త**

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంసీ)లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ పార్టీ ఎన్ఎంసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్ రెడ్డి అలుపెరగని కృషి చేస్తున్నారు. ఎక్కడ ఏ చిన్న సమస్య తన దృష్టికి వచ్చినా వెంటనే అధికారులకు తెలియజేసి పరిష్కారం జరిగేలా చూడడంలో తనవంతు ప్రయత్నం చేస్తున్నారు. అయితే పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం కావాలంటే ఎన్ఎంసీకి నిధుల కేటాయింపు జరగాల్సిన ఆవశ్యకతను గుర్తించిన ఆయన విషయాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా చూడాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టేకుల ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ హయాంలో వేసిన డ్రైనేజీ పైప్ లైన్లు ప్రస్తుతం పెరిగిన జనాభాకు ఏమాత్రం సరిపోవడం లేదని, దీంతో తరచూ డ్రైనేజీలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అంతర్గ రహదారులను ఎక్కడికక్కడ తవ్వి వదిలేయడంతో అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా నిజాంపేట డంపింగ్ యార్డు నుంచి రాజీవ్ గృహకల్పకు వెళ్లేందుకు రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో గత ఏడాది కాలంగా ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. పలుచోట్ల విద్యుద్దీపాల సమస్య ఉందని, పాత వాటికి మరమ్మతులతో పాటు కొత్త వాటిని కూడా వేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరాన్ని నొక్కి చెప్పారు. పలుచోట్ల మంచినీటి పైప్ లైన్ల సామర్థ్యాన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఇవన్నీ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలేనని, వీటి కోసం నిధుల కేటాయింపు జరపాలన్నారు. ఇందుకోసమే తాను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి నిధుల మంజూరుకు విన్నవించడం జరిగిందన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. తప్పకుండా నిధుల మంజూరీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రవీణ్ రెడ్డి తెలిపారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం జరిగే వరకు వదిలిపెట్టకుండా పోరాటం చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

## గుడ్స్ వాహనాన్ని ఢీకొట్టిన ఫార్చ్యూనర్

**-ఇద్దరికి గాయాలు ...**

**అత్తాపూర్ జనవరి3, ప్రభాతవార్త :**

ఔటర్ రింగ్ రోడ్డుపై ఫార్చ్యూనర్ కారు బీభత్సం సృష్టించిన సంఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.... రాజేంద్రనగర్ ఓఆర్ఆర్‌పై ఫార్చ్యూనర్ కారు అతివేగంగా దూసికొచ్చి ముందు వెళ్తున్న గుడ్స్ వాహనాన్ని బలంగా ఢీకొట్టడంతో గుడ్స్ వాహనం బోల్తా పడింది. దింతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలు అయ్యాయి. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయాలు అయిన వారికి ఆస్పత్రికి తరలించారు. అతివేగంగా కారును నడపడమే కారణమని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



## నిజాంపేట్ లో ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు

**నిజాంపేట్, జనవరి 3, ప్రభాతవార్త :** మహిళా అభ్యుదయం కోసం అహర్నిశలు కృషి చేసి విద్యాభివృద్ధి కోసం సామాజిక పరివర్తన కోసం నిరంతరం పాటుపడిన సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం సావిత్రి బాయి పూలే జన్మదినంను మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిన సందర్భంగా శుక్రవారం పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులందరిని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు రఘునాథ్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే దేశంలోనే మొదటిసారిగా ఉపాధ్యాయ వృత్తి చేపట్టి ఆనాడు విద్యకు దూరంగా ఉన్న అణగారిన వర్గాల, స్త్రీల, బాలికల అభ్యున్నతికి, వారి విద్యాభివృద్ధికై వారి జీవితాన్ని అంకితం చేసిన మహోన్నతురాలని వారి సేవలను కొనియాడారు. విద్యార్థులు సావిత్రి బాయి పూలేని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


**PUBLIC NOTICE**

General Public is hereby informed and notified that our client is intending to purchase the Property bearing All that is part and parcel of Sy.No.48/26/1(part), adm. 588 Sq. Yrds, Katedan, Rajendernagar, Rangareddy (Northern Side), from its lawful owner Mrs. Sameera Fatima Khatoon, for valuable Sale Consideration who in turn purchased the property from Smt. C.V. Vinitha Reddy. Any person (s) having any right, title or interest in respect of the above properties shall intimate their objections within 7 days from the date of this publication, or otherwise the transaction may be completed at the option of our client. The objections, if any, received thereafter shall be deemed to have been waived.

**AKSHAT SANGHI**
Advocate
Flat No. 302, Vansh Towers, 3rd Floor, Mahesh Nagar Colony, Chirag Ali Lane, Hyderabad-500 001. M: 9963102934
E-mail : akshatsanghi@gmail.com


## మోండా డివిజన్ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలి : కొంతం దీపిక




మేయర్ విజయ లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

**కంటోన్మెంట్, జనవరి 3 ప్రభాతవార్త:** మోండా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల చేయాలని కోరుతూ కార్పోరేటర్ కొంతం దీపిక శుక్రవారం గ్రేటర్ మేయర్ గద్వాల విజయ లక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొంతం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
సరూర్ నగర్ సర్కిల్-5

నిట్ నం.20/EE5/SRNR/GHMC/2024-25 తేది: 03.01.2025
పనిపేరు: "RCC పైప్ లైన్" పని (1) నం.లు కొరకు. అంచనా మొత్తం : రూ.25.00 లక్షలు. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ & సమయం : 10.01.2025 మ.3.01 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: శ్రీ కె.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC. (M) 9989930602. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ http://www.eprocurement.telangana.gov.in/ వద్ద చూడవచ్చును.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, GHMC.
DIPR.NO.8593-PP/CL/ADVT/1/2024-25 తేది: 03.01.2025

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, RENUKA W/O Raju Singh Khudale, Residing at H No 6-3-1242/175/1 Raj bhavan opp M S Maqtha Somajiguda Hyderabad Telangana. My Original name is RENUKA and I intend to change my name as SNEHA SINGH KHUDALE after marriage.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## రైతుల అభ్యున్నతి కోసం కృషి: చైర్మన్ చేకోలేకర్ లక్ష్మీ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సన్మానిస్తున్న చైర్మన్ చెకోలెకార్ లక్ష్మీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, డైరెక్టర్ ప్రత్యూష తదితరులు

**మలక్ పేట,జనవరి 3, ప్రభాతవార్త:** రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి పేర్కొన్నారు. చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు, నాయకులు కార్యకర్తలతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమపై అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రత్యూష, నాయకులు మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### కెటిఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జగన్ గౌడ్



**వనస్థలిపురం జనవరి3,ప్రభాతవార్త :** నూతన సంవత్సరం సందర్భంగా మాజీ మంత్రి వర్యులు,భారస పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు ముద్దగౌని జగన్ మోహన్ గౌడ్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియశారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధి కొరకు నిరంతరం కష్టపడాలని, భవిష్యత్ లో మంచి గుర్తుంపు ఉంటుందని కేటీఆర్ ఆయనకు భరోసా ఇచ్చారని తెలిపారు.

## ఈనెల 5 న శారదానగర్ లో ముగ్గుల పోటీలు

**వనస్థలిపురం జనవరి3,ప్రభాతవార్త :** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని శారదా నగర్ కాలనీ లొ కళా భారతి సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శారదా నగర్ లోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు శారదా నగర్ లోని మహిళల కు ముగ్గుల పోటీలు నిర్వహిస్తు న్నట్లు కళాభారతి కన్వీనర్ కొప్పోలు జగన్నాథ రావు ఒక ప్రకటనలో తెలిపారు.పోటీలలో పాల్గొనే మహిళలు ముందుగా తమ పేర్లను లక్ష్మి,పుష్పాంజలి,ఇందిరల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. మహిళలు తమకు కేటాయించిన గడిలో ఒక్కరే ఉండి ముగ్గు వేయాలన్నారు. విజేతలకు బహుమతులు అందజేయబడతాయన్నారు.

## విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు: డిఇ విష్ణువర్ధన్ రెడ్డి



డిఇ విష్ణువర్ధన్ రెడ్డిని సన్మానిస్తున్న రామకృష్ణానంద్ తదితరులు

**మలక్ పేట ,జనవరి 3, ప్రభాతవార్త :** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఆస్మాన్ ఘాడ్ విద్యుత్ శాఖ డిఇ విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. 1104 యూనియన్ నాయకులు రామకృష్ణానంద్ ఆధ్వర్యంలో డిఇ విష్ణువర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోదారులకు 24 గంటలు విద్యుత్ సరఫరా అందించడానికి కృషి చేస్తున్నామని, విద్యుత్ సరఫరా లో అంతారాయం తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని తక్షణమే పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడంతో ముఖ్యమంత్రి పై ఫిర్యాదు



ఇన్ స్పెక్టర్ నరేష్కుఊ ఫిర్యాదు చేస్తున్న బోయిని ఎల్లేష్ తదితరులు

**మలక్ పేట,జనవరి 3, ప్రభాతవార్త:** మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడంతో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, భట్టి విక్రమార్కలపై కేసు నమోదు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయిని ఎల్లేష్ మాదిగ మలక్ పేట పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26/ 08/ 2023న కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో ఎన్నికల సభను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ సభకు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ,అప్పటి పిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నాయకులు ఉత్తంకుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, భట్టి విక్రమార్కలు హాజరై ఎస్సీ/ ఎస్టీలకు డిక్లరేషన్ ప్రకటించారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మాదిగ కార్పొరేషన్ తదితర వాటిని ఏర్పాటు చేస్తామని చెప్పడం జరిగిందని, ఇప్పటివరకు మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడంతో మాదిగలు చాలా నష్టపోయారని పేర్కొన్నారు. మాదిగలను మోసం చేసిన వీరిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

### రేపు జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**సైదాబాద్, జనవరి 3 ప్రభాతవార్త:** చంపాపేటలోని సామ సరస్వతి గార్డెన్స్‌లో ఆదివారం జరుగనున్న రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి బిల్లకంటి కిరణ్ కుమార్ గుప్తా, వాసవి సేవాదళ్ అధ్యక్షుడు బచ్చు మహేష్ గుప్తాలు కోరారు. నూతన అధ్యక్షుడిగా గందె సురేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శిగా బిల్లకంటి కిరణ్ కుమార్ గుప్తాలతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మినారాయణతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఆర్యవైశ్యులందరు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.



సైదాబాద్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి



ఆర్కేపురం డివిజన్ అల్కా పురికాలనీ సావిత్రిబాయిపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి



సాయినగర్‌కాలనీలో సావిత్రిబాయిపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చింతల అరుణసురేందర్‌యాదవ్



రామంతాపూర్‌లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు



హబ్సిగూడ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మండల విద్యాధికారి రామరావు తదితరులు



బడంగ్‌పేట్‌లో సావిత్రీ బాయి పూలేకు నివాళులర్పిస్తున్న మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమీషనర్ సరస్వతి, అధికారులు, సిబ్బంది



ఐఎస్ సదన్ డివిజన్‌లో సావిత్రిబాయి పూలే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కోట్ల శ్రీనివాస్



తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో సావిత్రి పూలే జయంతి వేడుకల్లో నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

# ఘనంగా సావిత్రబాయి పూలేకు నివాళులు

## ఘనంగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు : నిర్వాహకులు లక్ష్మీదేవి

**మలక్ పేట, జనవరి 3, ప్రభాతవార్త:** ముసారాంబాగ్‌లోని శ్రీ అండళ్ నిలయంలో ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లక్ష్మీదేవి, రూపా దేవి, రామకృష్ణ లు పేర్కొన్నారు. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా సౌభాగ్యవంతులైన అండాళ్ నిలయం భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, తాంబూలం తదితర వాటిని అందజేసి భక్తిశ్రద్ధలతో పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధనుర్మాస ఉత్సవాలు డిసెంబరు 16వ తేదీన ప్రారంభం అయ్యాయని, జనవరి 13వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు. ప్రతిరోజు సాయంత్రం శ్రీమాన్ ఉభయ వేదాంతి చింపాపట్టణం జగన్మోహనచార్య స్వామి వారి చే ప్రవచన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 2వ తేదీ గురువారం ఉందు మద గళిత్త పాశురం పై ప్రవచనములు నిర్వహించడం జరిగిందని తెలిపారు. 5వ తేదీ ఆదివారం ఏత్తకలంగల్ మాతృశ్రీ రిందా దేవి తిరు నక్షత్రం సందర్భంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం, రాత్రి 7:30 గంటలకు రిందా శరణ్య నాట్యమండలి శ్రీమతి యశోద వారి బృందం నాట్య ప్రదర్శన, 8వ తేదీ బుధవారం అండాళ్ నిలయంలో దీపోత్సవం, స్వామి, అమ్మవార్లకు కర్పూర నీరాజనం, మంగళ



మహిళలకు పసుపు,కుంకుమ, తాంబూలం అందజేస్తున్న నిర్వాహకులు రూపాదేవి తదితరులు

శాసనం, 10వ తేదీ శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, 11వ తేదీ శనివారం అండాళ్ తల్లికి నీరాటోత్సవం, అనంతరం 108 గంగాలములతో అక్కార వడిశల్ విశేష ప్రసాద నివేదన వితరణ కార్యక్రమం, 13వ తేదీ సోమవారం భోగి పండుగ, గోదా కళ్యాణం, సాయంత్రం తిరుప్పావై ఫల శృతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు కావున భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, మలక్ పేట్ ఏసిపి శ్యాంసుందర్, మలక్ పేట ఇన్స్పెక్టర్ పిడమర్తి నరేష్, ఎస్సై సంజీవరెడ్డి తదితరులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మహానగరానికి హెల్త్ ఎడ్యుకేషన్, ఇండస్ట్రీస్ క్యూ : లక్ష్మారెడ్డి

**ఎల్.బి.నగర్, జనవరి 3 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం మహానగరంగా మార్చేందుకు స్పీడ్‌గా అడుగులు పడుతున్నాయని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జీ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి గురువారం శాలువాతో సత్కరించి,ముఖ్యమంత్రితో పలు అంశాల గురించి చర్చించారు.మహేశ్వరం నియోజకవర్గంలో ఫోర్త్‌సిటీ, గ్రీన్‌ఫార్మా, స్కిల్ యూనివర్సిటీ, హెల్త్, ఎడ్యుకేషన్ హబ్స్, ఇండస్ట్రియల్ పార్క్స్, మెట్రోరైలు రాకతో శరవేగంగా అభివృద్ధి చెందనుందని సీఎం రేవంత్‌రెడ్డి, కేఎల్‌ఆర్ మధ్య చర్చ జరిగింది. దేశానికే తలమానికం కానున్న 330 ఫీట్ల రోడ్డు, ఓఆర్‌ఆర్ టు ఆర్‌ఆర్‌ఆర్ వరకు విస్తరించే రోడ్లు, కంపెనీలకు భూసేకరణ సమస్య తలెత్తకుండా చూడాలని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి ముఖ్యమంత్రి సూచించా రు.ప్రపంచస్థాయి అగ్ర సంస్థలు ఫోర్త్‌సిటీకి క్యూ కడుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో కేఎల్‌ఆర్ జెన్నాయిగూడ, కందుకూరు మండల రైతులను భూసేకర



రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కేఎల్ఆర్, భాస్కర్‌రెడ్డి

ణకు ఒప్పించటం పట్ల సీఎం హర్షం వ్యక్తం చేశారు. రైతులు నష్ట పోకుండా పరిహారం, ప్లాట్లు, మహిళలకు సోలార్ ఎనర్జీ ప్లాంట్స్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు ముఖ్యమంత్రి దృష్టికి కేఎల్‌ఆర్ తీసుకెళ్లారు.ఫోర్త్‌సిటీతో పాటు మహేశ్వరం, కందుకూరు మండలాలను మున్సిపాలిటీలుగా తీర్చిదిద్దే అంశాలను చర్చించారు. స్కిల్ యూనివర్సిటీ సహ ఫోర్త్‌సిటీ పనులను నిరంతరం పర్యవేక్షించాలని కెఎల్‌ఆర్‌కు ముఖ్యమంత్రి సూచించారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అపరిష్కృతంగా సమస్యలు : ఈటల

**హయత్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త:** ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా జీహెచ్ఎంసీ పరిధిలో కనీస మౌళిక వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్లలో శుక్రవారం పర్యటించిన ఆయన దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా మిగిలిన డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి కొలను శివారెడ్డి కాలనీతో పాటు హయత్ నగర్ డివిజన్ పరిధిలోని పరిసర కాలనీల మురుగునీటిని మదర్‌డెయిరీ ఆవరణలోని ట్రంక్‌లైన్‌లో కలపాల్సి ఉంది. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు పలుమార్లు మదర్‌డెయిరీ అధికారులతో మాట్లాడినా ఫలితం లేకపోవడంతో కాలనీ వాసులు సమస్యను ఎంపీ ఈటెల రాజేందర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఈక్రమంలో ఆయన హయత్‌నగర్, మన్సూరాబాద్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, కాలనీవాసులతో కలిసి సమస్య నెలకొన్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మదర్‌డెయిరీ ఛైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, ఎండీ కృష్ణతో మాట్లాడి సమీప కాలనీల మురుగునీటిని ట్రంక్‌లైన్‌లో కలపడానికి ఒప్పించారు. సీఎస్‌ఆర్ కాలనీ నుంచి బాలాజీనగర్ వరకు కొనసాగుతున్న ట్రంక్‌లైన్ పనుల విషయమై జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడి వెంటనే పనులను ప్రారంభించాల్సిందిగా ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించక పోవడంతో పనులు చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో నిలిచి పోయిన పనులను వెంటనే తిరిగి ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్ పార్టీలు మారడంతో కౌన్సిల్ సమావేశాలను సమయానుసారంగా నిర్వహించడం లేదని ఆయన విమర్శించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని పార్టీల కార్పొరేటర్లకు సరైన నిధులను కేటాయించి అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.



సమస్యను తెలుసుకుంటున్న ఎంపీ ఈటెల రాజేందర్

### పిల్లర్లతో కూడిన ఫ్లైఓవర్ల నిర్మాణానికి చర్యలు

ఎల్.బి.నగర్ నుంచి మల్కాపూర్ వరకు కొనసాగుతన్న రోడ్డు విస్తరణ పనులలో భాగంగా పనామా, హయత్‌నగర్‌లో అండర్‌పాస్‌ల నిర్మాణానికి గతంలో ప్రతిపాదించగా... హయత్‌నగర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ల విజ్ఞప్తి మేరకు పిల్లర్లతో కూడిన ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం పార్లమెంట్‌లో ప్రతిపాదించానని ఈటెల తెలిపారు. కొద్దిరోజుల్లోనే పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానన్నారు. అటవీ శాఖ అధికారులతో మాట్లాడి మన్సూరాబాద్–పోచంపల్లి రోడ్డును పునఃప్రారంభించేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామరంగారెడ్డి, నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, రవీందర్ గౌడ్, కొలను శివారెడ్డినగర్ వ్యవస్థాపక అధ్యక్షులు కొలను నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### చిలుకానగర్ డివిజన్‌కు నిధులు కేటాయించండి : బన్నాల గీత



జెడ్‌సికి వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్

**ఉప్పల్, జనవరి 3 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ కోరారు. శుక్రవారం ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్లకు నిధులు కేటాయించాలని, బీరప్పగడ్డలో స్ట్రామ్ వాటర్ డ్రైన్‌లు నిర్మించాలని కోరారు. అజ్మత్‌నగర్‌లో కమ్యూనిటిహాల్ నిర్మించాలని, ఇందిరానగర్‌లో నూతన బోర్ మంజూరు చేయాలని కోరారు. మున్సిపల్ మైదానంలో ప్రైవేటు ఈవెంట్‌లకు అనుమతి ఇవ్వవద్దని సూచించారు. మద్యం పార్టీలకు ఇవ్వకుండా చూడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

### రామంతాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం

**రామంతాపూర్, జనవరి 3 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే శుక్రవారం నుంచి ప్రారంభించారు. ఉప్పల్ డిప్యూటి కమిషనర్ అంజనేయులు, హౌజింగ్ ఎసి కె.శివకుమార్, వార్డు అడ్మినిస్ట్రేషన్ అధికారులు, సర్వేయర్లతో కలిసి ఇంటింటి సర్వే చేపట్టారు. గత ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి వారి వివరాలు నమోదు చేసుకుంటున్నామని తెలిపారు. ప్రతి సర్వేయర్ రోజు కనీసం 50 గృహాలను సర్వే చేయాలని, ఫోన్ సిగ్నల్ సమస్యలు ఉన్నట్లయితే డేటాను పాక్షికంగా నమోదు చేసుకోవాలని సూచించారు. సర్వేయర్లు దరఖాస్తుదారులను ఒక రోజు ముందుగానే ఫోన్‌కాల్ చేసి సంప్రదించాలని, వారు ఇళ్ల వద్దనే ఉండాలని సూచించాలని కోరారు. అధికారులు సమన్వయంతో పని చేసి సర్వే విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అఫీసర్లు శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అంధుల వసతి గృహాల పరిశీలించిన కార్పొరేటర్ కొత్తకాపు అరుణ



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 3 ప్రభాతవార్త:** ఈ నెల 4వ తేదీన నలుయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా అంధుల బాలికల, బాలుర వసతి గృహాలను సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. వసతి గృహాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి కార్పొరేటర్ సూచించారు.

### క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**ఎల్.బి.నగర్, జనవరి 3 ప్రభాతవార్త:** నూతన సంవత్సరం అందరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నూతన సంవత్సరం 2025 సందర్భంగా బిఆర్ అంబేద్కర్ ఆర్టీవో భవన్‌లో తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా రవాణాశాఖ హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్, జెటీసీలు రమేష్, చంద్రశేఖర్‌గౌడ్, శివలింగయ్య, డిటిసి రవీందర్‌గౌడ్, అసోసియేషన్ అధ్యక్షుడు నాయకం శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ ప్రతీష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ట్రెజరర్ హనుమంతు, జాయింట్ సెక్రెటరీ నవీన్, గంగాధర్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చూడాలి : రజితరెడ్డి



ఉప్పల్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న కార్పొరేటర్ రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జనవరి 3 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ వార్డు కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో తప్పులు జరుగకుండా చూడాలని, అర్హుల ఎంపిక విషయంలో అధికారులకు సహకరించాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా అర్హతలే ప్రామాణికంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు. లబ్దిదారుల ఎంపిక సర్వే వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటి కమిషనర్ అంజనేయులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బాకారం లక్ష్మణ్, సల్ల ప్రభాకర్‌రెడ్డి, ఈగ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

### మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న కూచిపూడి నాట్య ప్రదర్శనలు



ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న కళాకారులు దృశ్యం

**ఉప్పల్, జనవరి 3 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం అభినయ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నాట్య గురువు కళ్యాణి ఆవుల శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గణేశా కౌతం, ప్రదోశ శివపాదం, రామనాటకం భావం లోన, హిందువుల తిల్లాన, కంజదళయాదాక్షి రావేలా రా,రారానస్వామి, ధనశ్రీ, తిల్లాన, గణేశా పంచరత్న తదితర అంశాలను కలాకారులు అభినయ్, శైవి, హను మాన్ రవి, సన్నుత, కిరణ్మయి.సియోను, ఇపితా,స్నేహా,అన్య, శ్రీనిధి,అక్షయ,శ్రద్ధ తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

### బాలాపూర్‌లో ఘనంగా అయ్యప్ప పడి పూజ



అయ్యప్ప పడి పూజను నిర్వహించిన మేయర్ పారిజాత కుటుంబం

**సరూర్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్‌లోని మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి నివాసంలో గురువారం సాయంత్రం అయ్యప్ప స్వామి పడి పూజోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మేయర్ దంపతులు పారిజాత, నర్సింహారెడ్డి తమ కుటుంబ సభ్యులు చిగిరింత దయాసాగర్‌రెడ్డి, డాక్టర్ యశస్వినిరెడ్డిలతో పాటు చిగిరింత యాదగిరిరెడ్డి, భాగ్యలక్ష్మి అదేవిధంగా చిగిరింత చిన్న బాల్‌రెడ్డి కుటుంబీకులతో కలిసి అయ్యప్ప పడి పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పకు పుష్పాలతో పాటు పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం పడి వెలిగించి అయ్యప్ప స్వాములకు, భకు_లకు తీర్థ ప్రసాదాలు, అలా_హారం, భోజన వితరణ చేశారు. ఈ పూజోత్సవంలో బాలాపూర్ అయ్యప్ప సన్నిధానం స్వాము లతో పాటు పలువురు పాల్గొన్నారు.

### స్థానిక ఎన్నికల్లో బిజెపి విజయబావుటా ఎగురవేయాలి : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కేంద్ర మ ంత్రి కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిజెపి విజయబా వుటా ఎగురవేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో కలిసి నూతన సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ కొత్త సంవత్సరంలో బిజెపిని మరింత శక్తివంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రంగారెడ్డి జిల్లాలో పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గాజుల మధు, ప్యాట నరేష్ పాల్గొన్నారు.

### సమస్యలను పరిశీలించిన కార్పొరేటర్ పవన్ కుమార్

**ఎల్.బి.నగర్, జనవరి 3 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ బాలాజీ నగర్ కాలనీలో డ్రైనేజీలైన్ సమస్యను కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ గురువారం పరిశీలించారు. కాలనీలో పాత డ్రైనేజీ లైన్ అంత పాడైపోయి డ్రైనేజీ మురికినీళ్లు రోడ్లపైకి వస్తున్నాయని దీంతో ప్రజలకు చాల ఇబ్బంది కరంగా మారుతుందని సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని జలమండలి ఏఈ శ్రవంతిరెడ్డికి కార్పొరేటర్ సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వెంటనే నూతన డ్రైనేజ్ లైన్ పనులు ప్రారంభించాలన్నారు. ఈ పరిశీలనలో జలమండలి అధికారులు అరిఫ్, దయాకర్, కాలనీ సెక్రెటరీ స్వామి, డివిజన్ బిజెపి అధ్యక్షుడు మంచి రాజేష్, యాదయ్య, గణేష్, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

### కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి: వర్కర్స్ యూనియన్

**సరూర్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త:** మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌స్సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ తదితర పద్ధతుల్లో పని చేస్తున్న సిబ్బందిని అందరినీ ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర యూనియన్ అన్ని మున్సిపాలిటీల్లో ప్రదర్శనలు నిర్వహించి వినతి పత్రాలు సమర్పించాలని ఇచ్చిన పిలుపు మేరకు మీర్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో కమీషనర్‌కు బాలాపూర్ మండల యూనియన్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల సిఐటియు అధ్యక్షుడు దాసరి బాబు మాట్లాడుతూ సిబ్బందికి కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ప్రతి నెలలో మొదటి వారంలోనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్ యాదవ్, సిహెచ్ యాదగిరి, బి.కమలమ్మ, కె.అంజుర, సి.సత్తమ్మ, జి.అండాలు తదితరులు పాల్గొన్నారు.

### సూర్యవంశీకాలనీ నుంచి బొమ్మిడాల గోదాముల వరకు వారంతపు సంత

**హయత్‌నగర్, జనవరి 3 ప్రభాతవార్త:** జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ లక్ష్మారెడ్డి పాలెంలో ఫ్లైఓవర్ ఏర్పాటు చేయడంతో కూరగాయల మార్కెట్ (వారంతపు సంత)కోసం రోడ్డు దాటటం ఇబ్బందిగా మారుతోంది. సమస్యను ఆయా కాలనీవాసులు కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా... ఆయన శుక్రవారం కూరగాయల వ్యాపారులతో చర్చించారు. నగరంవైపు వెళ్లే దారిలో సూర్యవంశి కాలనీ ముఖద్వారం నుంచి బొమ్మిడాల గోదాముల వరకు కూరగాయల విక్రయాలను కొనసాగించాలని సూచించారు. తద్వారా జాతీయ రహదారికి ఎడమవైపునున్న కాలనీవాసులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈనెల 11 నుంచి ప్రతినెల శనివారం రోజున వారంతపు సంతను ఏర్పాటుచేయడం ద్వారా కాలనీవాసుల సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సూర్యవంశీ, సాయి కుటీర్ కాలనీల ప్రతినిధులు ఏపాల నరేందర్‌రెడ్డి, నక్కరవీంద ర్‌రెడ్డి, నక్కసంజీవ్‌గౌడ్, ఎన్నేపల్లి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.